ANN తెలుగు

Follow: @ANNTELUGU

18-07-2026

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 195 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ధరణి అక్రమాలపై సిట్

- భూ లావాదేవీలపై సమగ్ర విచారణ
- రేవంత్ కేబినెట్ కీలక నిర్ణయాలు
- విద్య, నీటిపారుదల, గ్రామ పంచాయతీలు సహా పలు అంశాలకు ఆమోదం

**హైదరాబాద్, మహా :** ధరణి అక్రమాలపై సిట్ దర్యాప్తు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో దాదాపు మూడు గంటల పాటు జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన ధరణి పోర్టల్ వ్యవహారంపై కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిగతా 2వ పేజీలో




టాప్ న్యూస్

హైడ్రాపై హైకోర్టు ఫైర్


### కోర్టు ఆదేశాలు పట్టవా?



- స్టేటస్ కో ఉన్న స్థలంలో కూల్చివేతలేంటి?

03

### పొత్తుల్లేవ్ పోట్లాటే



- స్థానిక ఎన్నికల్లో బలమున్న ప్రతి చోట జనసేన పోటీ
- లోకల్ వార్ పై మంత్రి నాదెండ్ల మనోహర్ హాట్ కామెంట్స్


02

### షోరూమ్‌ల నుంచి స్కూటీలు ఎత్తుకెళ్లండి



- కాంగ్రెస్ నేతల షోరూమ్‌ల నుంచి తీసుకెళ్లాలన్న ఎమ్మెల్యే
- విద్యార్థులకు బిజెపి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పిలుపు

03



### విశ్వకుటుంబంగా మారుతున్న భారత్

- వలసల స్వర్గధామం ఇండియా.
- కోటికి చేరనున్న దేశంలో విదేశీయుల సంఖ్య.

03

### ఫిఫా ఫీవర్‌కు తెలంగాణ సర్కార్ గ్రీన్‌సిగ్నల్

- బార్ల పనివేళలు పొడిగింపు

02



### కేంద్ర నిధులతోనే తెలంగాణలో అభివృద్ధి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- సిరిసిల్లలో రూ.105 కోట్లతో కార్గిల్ చెరువు పునరుద్ధరణ పనులకు మంత్రి శంకుస్థాపన
- అమృత్ పథకం నిధులను దారి మళ్ళించడం దారుణం
- లేఖ రాస్తే నిధులు ఆగిపోతాయని హెచ్చరిక

03



# రేవంత్ బుల్లెట్ వ్యూహం

## శ్రీశైలానికి మహర్దశ

- హైదరాబాద్ - బెంగళూరు మార్గం శ్రీశైలంమీదుగా మళ్ళించాలని సీఎం సూచన
- రెడీ అవుతున్న తుది ప్రతిపాదనలు
- గంటలోనే హైదరాబాద్ టు శ్రీశైలం జర్నీ
- కేంద్రం అలైన్ మెంట్ ను మార్చమని సూచించిన సీఎం
- నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు బెనిఫిట్ అయ్యేలా వ్యూహం

**హైదరాబాద్, మహా :** తెలుగు రాష్ట్రాల మీదుగా మూడు బుల్లెట్ రైళ్ల ప్రాజెక్టులకు కేంద్ర గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మెరుపు ఆలోచనతో శ్రీశైలం దేవస్థానానికి, పట్టణానికి మహర్దశ పట్టనుంది. హైదరాబాద్ టు చెన్నై, హైదరాబాద్ టు బెంగళూరు, హైదరాబాద్ టు ముంబై ప్రాజెక్టులకు పట్టాలెక్కబోతుండగా, హైదరాబాద్ నుంచి చెన్నైకు, బెంగళూరుకు వెళ్లే హై స్పీడ్ రైలు కారిడార్లకు సంబంధించి అలైన్‌మెంట్‌ల ప్రక్రియపై కసరత్తు వేగంగా జరుగుతోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రెండు బుల్లెట్ రైలు ప్రాజెక్టుల అలైన్‌మెంట్‌లపై అధికారులతో సమీక్ష చేశారు. హైదరాబాద్ టు బెంగళూరు, హైదరాబాద్ టు చెన్నై మార్గాల అలైన్‌మెంట్‌లో రూట్ మ్యాప్‌తో పాటుగా తాజాగా చేసిన సవరణలకు సంబంధించి సీఎంకు అధికారులు వివరించినట్లు మిగతా 2వ పేజీలో

# మళ్ళీ కరోనా కలకలం

- ఏపీలో టెన్షన్.. టెన్షన్
- 12 మందికి కరోనా పాజిటివ్
- నలుగురు మృతితో భయం భయం



**అమరావతి, మహా :** భారత్‌లో మరోసారి కరోనా కేసులు నమోదవుతున్నాయి. మరణాలు కూడా సంభవిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 12 కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కాగా, వీరిలో నలుగురు బాధితులు మృతి చెందారని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. కరోనా బారిన పడిన మరణించిన వారిలో వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ముగ్గురు, కాకినాడ జిల్లాకు చెందిన ఒకరు ఉన్నారని, వారంతా ఇదివరకే తీవ్రమైన ఇతర ఆరోగ్య సమస్యలతో (కోమార్బిడిటీస్) బాధపడుతున్నారని వీరపాండియన్ స్పష్టం చేశారు. వైరస్ జన్యు క్రమ స్వరూపాన్ని విశ్లేషించేందుకు 5 శాంపిల్స్ సేకరించి పుణెలోని జాతీయ వైరాలజీ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

**కడపలో అత్యధిక కరోనా కేసులు**

ఏపీలో నమోదైన మొత్తం కోవిడ్19 కేసుల్లో అత్యధికంగా వైఎస్సార్ కడప జిల్లాలో 8 కేసులు, గుంటూరులో 2, విశాఖపట్నం, కాకినాడ జిల్లాల్లో ఒక్కో కేసు నమోదయ్యాయి. ప్రజలెవరూ ఆందోళన చెందకుండా మిగతా 2వ పేజీలో

### మంథని సిగలో మరో మణిహారం..

- శ్రీధర్ బాబు కృషికి ఫలితం
- మంత్రి పట్టుదలతో మంథనికి న్యాక్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్
- భవన నిర్మాణానికి రూ.20 కోట్ల మంజూరు.. ఉత్తర తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణకు కొత్త దిక్సూచి

05



### ఏపీ లిక్కర్ రవాణా కేసులో ఈడీ దూకుడు

- రూ.195 కోట్లకు పైగా అక్రమ లబ్ధిపై కీలక గుర్తింపులు.

02






## దేశంలో పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు

- హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ
- టికెట్ ధర రూ.5 నుంచి రూ.25 మధ్య ఉండే అవకాశం
- భద్రతపై ప్రత్యేక దృష్టి.. లీకేజీని గుర్తించే సెన్సార్లు
- ఒకేసారి 2,600 మంది ప్రయాణించే సామర్థ్యం

02



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు

## ఆరోగ్య భద్రత

- తెలంగాణలో న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ ప్రారంభం
- ఉద్యోగులు, పెన్షనర్లు సహా 17.88 లక్షల మందికి లబ్ధి
- రాష్ట్రంలోని 1000కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నగదురహిత వైద్యం
- డిజిటల్ హెల్త్ కార్డుల ద్వారా సేవలు.. ఎన్ఈహెచ్ఎస్ వెబ్ పోర్టల్ ఆవిష్కరణ

02





# మళ్ళీ కరోనా కలకలం

**( మొదటి పేజీ తరువాయి )**
తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి చికిత్స తీసుకోవాలని ఆయన సూచించారు. మరోవైపు, రాష్ట్ర సర్వైలెన్స్ విభాగం ఇప్పటికే అన్ని బోధనాసుపత్రులు, జీజీహెచ్‌లు, డీఎంహెచ్‌వోలకు అత్యవసర మార్గదర్శకాలు జారీ చేసింది. ఆక్సిజన్ సిలిండర్లు, కరోనా మందులు, ఆర్టీపీసీఆర్ కిట్లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో రోగుల నుంచి కరోనా పరీక్షల కోసం స్వాబ్ నమూనాలను సేకరించేందుకు అవసరమైన వీటీఎం కిట్లు, వైద్య సిబ్బంది ధరించే పీపీఈ కిట్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయా అని ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# రేవంత్ బుల్లెట్ వ్యూహం

**( మొదటి పేజీ తరువాయి )**
తెలుస్తోంది. దీనిపై శుక్రవారం కేబినెట్ సమావేశంలోనూ చర్చ జరిగింది.

**కేంద్రం ఖరారుచేసిన అలైన్ మెంట్ లో సీఎం మార్పులు**
హైదరాబాద్ నుంచి ఏపీ మీదుగా బెంగళూరు, చెన్నై వెళ్లే బుల్లెట్ రైలు అలైన్‌మెంట్‌ల్లో కీలక మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో నిర్వహించిన సమావేశంలో బెంగళూరు, చెన్నై మార్గాల్లో కొన్ని మార్పులను సూచించినట్లు తెలుస్తోంది. గతంలో కేంద్రం ఖరారు చేసిన అలైన్‌మెంట్ ప్రకారం.. తెలంగాణ పరిధిలో హైదరాబాద్‌బెంగళూరు రూట్‌లో 218కి.మీ ఉన్నాయి.. 3 స్టేషన్లు ప్లాన్ చేశారు. ఈ రూట్‌లో తెలంగాణలోని శంషాబాద్, మహబూబ్‌నగర్.. ఏపీలోని కర్నూలు మీదుగా రూట్ ప్రతిపాదించారు. ఇపుడు హైదరాబాద్‌బెంగళూరు బుల్లెట్ రైలు మార్గాన్ని శంషాబాద్, భారత్ ఫ్యూచర్‌సిటీ, ఆమనగల్లు, మన్ననూరు, శ్రీశైలం, సోమశిల మీదుగా తీసుకెళ్లే అంశాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. అప్పుడు హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తుందని సీఎం సూచించినట్లు సమాచారం. ఈ మేరకు మార్పులు చేసిన అలైన్‌మెంట్‌లను ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్‌కు నివేదించి ఖరారు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరే అవకాశం కనబడుతోంది.

**నల్లగొండ, ఖమ్మంకు బుల్లెట్ రైలు**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సౌత్ తెలంగాణ సమగ్ర



ప్రగతికి బుల్లెట్ వ్యూహం రచించారు. హైదరాబాద్ టు చెన్నై బుల్లెట్ రైలు మార్గంలో కూడా సీఎం రేవంత్ కొన్ని సూచనలు చేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఈ మార్గంలో మొత్తం 744 కిలోమీటర్లు ఉండగా.. తెలంగాణ పరిధిలో 236 కిలోమీటర్లు ఉండగా.. ఐదు స్టేషన్‌లు ప్లాన్ చేశారు. కానీ ఈ రైల్వే లైన్ దరాబాద్, శంషాబాద్, భారత్ సిటీ, డ్రైపోర్ట్, హాలియా, వాడపల్లి, దాచేపల్లి మీదుగా కాకుండా శంషాబాద్, బాటసింగారం, నార్కట్‌పల్లి, సూర్యాపేట, ఖమ్మం మీదుగా అమరావతికి చేరుకునేలా అలైన్‌మెంట్‌లో మార్పులు ప్రతిపాదించినట్లు సమాచారం. హైదరాబాద్ టు అమరావతి మధ్య ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రోడ్డుకు సమాంతరంగా ఈ బుల్లెట్ రైలు వెళ్లేలా సూచనలు చేసినట్లు తెలుస్తోంది. అప్పుడు తెలంగాణ ప్రభుత్వం చెబుతున్న డ్రై పోర్టుకు లైన్ క్లియర్ అవుతుందంటున్నారు. అందుకే హైదరాబాద్ టు శంషాబాద్, నల్లగొండ జిల్లా మీదుగా అమరావతికి రూట్ ఉండేలా ప్రతిపాదించినట్లు సమాచారం. దీని వల్ల ఏపీకి కూడా ప్రయోజనం లభించనుంది. రేవంత్ బుల్లెట్ వ్యూహాలు.. తెలుగురాష్ట్రాల ప్రగతిని హైస్పీడ్ చేయనుంది. మార్పులపై అధికారిక ఆమోదముద్ర పడితే.. ఆయా ప్రాంతాలప్రగతిలో అనూహ్యమార్పులు చోటుచేసుకోబోతున్నాయి.

# హైడ్రాపై హైకోర్టు ఫైర్ కోర్టు ఆదేశాలు పట్టవా?

**స్టేటస్ కో ఉన్న స్థలంలో కూల్చి వేతలేంటి?**

**హైదరాబాద్, మహా :** హైడ్రా వ్యవహారశైలిపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హయత్‌నగర్ పరిధిలోని ఒక వివాదాస్పద స్థలానికి సంబంధించి న్యాయస్థానం గతంలోనే స్పష్టమైన 'స్టేటస్ కో' ఆర్డర్ జారీ చేసినప్పటికీ, హైడ్రా అధికారులు ఆ ఆదేశాలను బేఖాతరు చేయడంపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కోర్టు పరిధిలో ఉన్న ఆ స్థలంలోకి చొరబడటమే కాకుండా, అక్కడ ఉన్న నిర్మాణాలను అక్రమంగా కూల్చివేసి, అది పార్క్ స్థలమంటూ హైడ్రా బోర్డును ఏర్పాటు చేయడాన్ని న్యాయస్థానం తీవ్రంగా తప్పుపట్టింది. చట్టపరమైన నిబంధనలను, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ హైడ్రా ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.తమ స్థలంలో హైడ్రా బలవంతపు కూల్చివేతలకు పాల్పడటంపై బాధితుడు/పిటిషనర్ అత్యవసరంగా హైకోర్టులో 'లంచ్ మోషన్' పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాలు అమలులో ఉన్నప్పటికీ అధికారులు ఈ ఘాతుకానికి ఒడిగట్టారని పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం..న్యాయపరమైన ప్రక్రియను విస్మరించి



ప్రైవేట్ ఆస్తుల వివాదాల్లో హైడ్రా జోక్యం చేసుకోవడంపై మండిపడింది. కోర్టు పరిధిలో ఉన్న కేసులను విస్మరిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించిన హైకోర్టు, ఈ కూల్చివేత వ్యవహారంపై పూర్తి వివరణ ఇవ్వాలని హైడ్రా అధికారులను ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య భద్రత

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు చిరకాలంగా నిరీక్షిస్తున్న 'న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్' (ఎన్‌ఈహెచ్‌ఎస్) శుక్రవారం లాంఛనంగా ప్రారంభమైంది. సచివాలయంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ (ఈహెచ్ సీటీ) అధికారిక పత్రాలతో పాటు, ఎన్‌ఈహెచ్‌ఎస్ వెబ్ పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులను మంత్రులు ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4.39 లక్షల మంది ఉద్యోగులు, 3.62 లక్షల మంది పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం 17.88 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. వీరికి 114 ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు అపోలో, యశోద, కిమ్స్, కేర్, స్టార్ వంటి 886 ప్రముఖ కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో నగదురహిత (క్యాష్‌లెస్) వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్‌ఎస్) ధరలకు అనుగుణంగా 1,816 రకాల మెడికల్, సర్జికల్ ప్యాకేజీలను ఈ పథకంలో పొందుపరిచారు. పథకం నిర్వహణ కోసం ఉద్యోగులు, పెన్షనర్లు తమ ప్రాథమిక వేతనం లేదా పెన్షన్‌లో 1.5 శాతం వాటాను విరాళంగా అందజేస్తారు. అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా తన వంతుగా జమ చేస్తుంది. నిధుల నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటిస్తూ ప్రభుత్వ, ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులతో కూడిన ఒక ప్రత్యేక ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు ఎన్‌ఈహెచ్‌ఎస్ పోర్టల్ ద్వారా తమ డిజిటల్ హెల్త్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. గత ఆరోగ్య పథకంలోని లోపాలను అధిగమిస్తూ, ఉద్యోగ సంఘాల నుంచి అందిన సూచనల మేరకు ఈ సరికొత్త పథకాన్ని అత్యంత పకడ్బందీగా రూపొందించినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జూలై మధ్య నాటికి ఈ నగదు రహిత సేవలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని అధికారులు వెల్లడించారు. ఈ పథకం ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం నుంచి భారీ ఊరటనిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

# షోరూమ్‌ల నుంచి స్కూటీలు ఎత్తుకెళ్లండి

**విద్యార్థులకు బిజెపి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పిలుపు**

**నిజామాబాద్, మహా :** బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి కాంగ్రెస్ నేతల షోరూమ్‌ల నుంచి స్కూటీలు తీసుకెళ్లాలని కాలేజీ స్టూడెంట్స్‌కు పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లో నిర్వహించిన ' ఇందూర్ రణభేరి ' కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే తొలి సంతకమని ఎమ్మెల్యే తెలిపారు.



# ఓటే ప్రజాస్వామ్యానికి పునర్జీవం

- **ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు కృషి చేయండి**
- **కాంగ్రెస్ సీనియర్ నాయకులు బల్లి శ్రీనివాస్**

కుషాయిగూడ, మహా : ఓటే భారత ప్రజాస్వామ్యానికి పునరు జీవనమని ప్రతి ఒక్కరూ ఎన్యుమరేషన్ ప్రక్రియలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బల్లి శ్రీనివాస్ గుప్తా పిలుపునిచ్చారు. ఓటు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు లాంటిదని ఎస్‌ఐఆర్లో భాగంగా ప్రభుత్వ ఓటింగ్ అధికారులకు సహకరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. జవహర్ నగర్ పరిధిలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ శ్రేణులతో శుక్రవారం ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బల్లి శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటరే విలువైన శక్తి అన్నారు. జవహర్ నగర్ లో 100% ఎస్ఐఆర్ నమోదే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కల్లేపల్లి సదానంద్, సీనియర్ నాయకులు కొటేష్ గౌడ్, గజ్వేల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు

- **హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ**
- **టికెట్ ధర రూ.5 నుంచి రూ.25 మధ్య ఉండే అవకాశం**
- **భద్రతపై ప్రత్యేక దృష్టి.. లీకేజీని గుర్తించే సెన్సార్లు**
- **ఒకేసారి 2,600 మంది ప్రయాణించే సామర్థ్యం**

హరియాణా, మహా : భారత్‌లో తొలి పర్యావరణహిత హైడ్రోజన్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన ఈ 10 కోచ్‌ల రైలు నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తూ కాలుష్య రహితంగా ప్రయాణిస్తుంది. ఈ తొలి హైడ్రోజన్ రైలు హరియాణాలోని జింద్ సోనిపత్ మధ్య సేవలు అందిస్తుంది. భారత రైల్వే చరిత్రలో సరికొత్త విప్లవానికి నాంది పలికారు. దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ ఇంధన రైలు పట్టాలెక్కింది. హరియాణాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభించారు. రైల్వే రంగంలో పర్యావరణహిత విధానాలకు పెద్దపీట వేస్తూ, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో మన ఇంజినీర్లు ఈ మోడ్రన్ రైలును రూపొందించారు. స్టీమ్, డీజిల్, విద్యుత్ రైళ్ల తర్వాత భారత రైల్వే ప్రస్థానంలో ఇదొక మైలురాయిగా నిలిచింది.

**ఈ రైలు ప్రత్యేకతలు ఇవే**
హైడ్రోజన్ రైలు సాధారణ విద్యుత్ రైళ్లలా కాకుండా, తన శక్తిని తానే స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది. ఇందులోని 1,200 కిలోవాట్ల సామర్థ్యం గల ప్రోటాన్ ఎక్స్ఛేంజ్ మెంబ్రేన్ ఫ్యూయెల్ సెల్ ప్లాంట్‌లో హైడ్రోజన్, ఆక్సిజన్ ల మధ్య రసాయన చర్య జరిగి విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ విద్యుత్ 3,200 హెచ్‌పీ ప్రొపల్షన్ వ్యవస్థ ద్వారా మోటార్లకు అంది, రైలు గంటకు దాదాపు 75 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా చేస్తుంది. ఇంధన దహనచర్య లేకపోవడం వల్ల హైడ్రోజన్ రైలు నుంచి కేవలం నీటి ఆవిరి, వేడి మాత్రమే




వెలువడుతాయి. హానికారక కర్బన ఉద్గారాలు, శబ్ద కాలుష్యం లేని పర్యావరణహిత ప్రయాణం వీలవుతుంది.ఈ రైలులో అత్యున్నత రక్షణ ప్రమాణాలతో కూడిన పలు అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. హైడ్రోజన్ లీకేజీలు, వేడి లేదా మంటలను క్షణాల్లో గుర్తించి అప్రమత్తం చేసే ఆటోమేటిక్ షట్ ఆఫ్ వ్యవస్థను సెటప్ చేశారు. నిరంతర వెంటిలేషన్ సౌకర్యం వల్ల ఒకవేళ లీకేజీ జరిగినా గ్యాస్ గాల్లో కలిసిపోతుంది. లోకోపైలట్ కేబిన్‌ను సైతం ప్రత్యేకంగా డిజైన్ చేసి, అన్ని భద్రతా అంశాలను పర్యవేక్షించేలా ఇందులో స్క్రీన్‌ను అమర్చి అన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఈ రైలు నిర్వహణ కోసం జింద్‌లో ప్రత్యేకంగా హైడ్రోజన్ నిల్వ, డిస్పెన్సింగ్ కేంద్రాన్ని నిర్మించారు.
తొలి దశలో ఈ హైడ్రోజన్ రైలు నార్త్ రైల్వే పరిధిలోని హర్యానాలోని జింద్ సోనిపత్ మధ్య 89 కిలోమీటర్ల మార్గంలో 12 స్టేషన్లలో హాల్ట్ ద్వారా ప్రయాణించనుంది. రానున్న రోజుల్లో కల్కా షిమ్లా వంటి మార్గాల్లోనూ హైడ్రోజన్ రైళ్లను ప్రవేశపెట్టనున్నారు. ప్రపంచవ్యాప్తంగా జర్మనీ, చైనా వంటి దేశాల్లో 2 నుండి 4 కోచ్‌లతో మాత్రమే హైడ్రోజన్ రైళ్లు నడుస్తుండగా, భారత్ రికార్డు స్థాయిలో 10 కోచ్‌లతో, ఒకేసారి 2,600 మంది ప్రయాణించేలా రైలును తీసుకొచ్చారు.

**కాలుష్యానికి గుడ్‌బై**
సాధారణ డీజిల్ ఇంజిన్ల నుంచి కార్బన్ డైఆక్సైడ్, పొగ వెలువడుతుంది. హైడ్రోజన్ రైలులో మాత్రం అలాంటి ఉద్గారాలు ఉండవు. నీటి ఆవిరి మాత్రమే విడుదల కావడం ప్రత్యేకత. శబ్దం కూడా తక్కువగా ఉంటుంది. అందుకే దీనిని ప్రపంచంలోనే అత్యంత పర్యావరణహిత రైళ్లలో ఒకటిగా భావిస్తున్నారు. భవిష్యత్తులో రైల్వే కాలుష్యాన్ని తగ్గించడంలో ఈ సాంకేతికత కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.

**ప్రయాణికులకు చౌక ప్రయాణం**
ప్రస్తుతం ఈ రైలు హరియాణాలోని జింద్‌సోనిపట్ మధ్య 89 కిలోమీటర్ల మార్గంలో నడుస్తోంది. రోజుకు రెండు ట్రిప్‌లు వేస్తుంది. టికెట్ ధర రూ.5 నుంచి రూ.25 మధ్య ఉండే అవకాశం ఉంది. కొన్ని మెట్రో ప్రయాణాల కంటే, కొన్ని రైల్వే ప్లాట్‌ఫామ్ టికెట్ల కంటే కూడా ఇది చౌకగా ఉండటం విశేషం.

**వేగం.. సామర్థ్యం కూడా ఎక్కువే**
ఈ రైలు గంటకు 75 కిలోమీటర్ల వేగంతో నడుస్తుంది. ట్రయల్ రన్‌లో గంటకు 120 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంది. ఇందులో రెండు డ్రైవింగ్ పవర్ కార్లు, ఎనిమిది ప్రయాణికుల కోచ్‌లు ఉన్నాయి. మొత్తం 682 సీట్లు ఉంటాయి. ఒకేసారి సుమారు 2,600 మంది వరకు ప్రయాణించగల సామర్థ్యం ఈ రైలు సొంతం.

# పొత్తుల్లేవ్ పోట్లాటే

**లోకల్ వార్ పై మంత్రి నాదెండ్ల మనోహర్ హాట్ కామెంట్స్**

**గుంటూరు, మహా :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, కూటమి పొత్తులపై మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీకి బలం ఉన్న ప్రతి చోటా తప్పకుండా పోటీ చేస్తామన్నారు. ఈ ప్రకటనతో రాబోయే ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. గుంటూరులో నాదెండ్ల మీడియాతో మాట్లాడుతూ జనసేన భవిష్యత్ కార్యాచరణను వెల్లడించారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం, ఓట్ల చీలకూడదన్న కారణంతో తాము సీట్ల విషయంలో వెనక్కి తగ్గామని నాదెండ్ల మనోహర్ గుర్తుచేశారు. ఆనాడు రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వనని ఇచ్చిన మాట కోసం జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కట్టుబడి నిలబడ్డారని, కూటమిని బలోపేతం చేయడం కోసమే జనసైనికులు నాలుగు అడుగులు వెనక్కి వేశారని పేర్కొన్నారు. అయితే, సార్వత్రిక ఎన్నికల నాటి ఆ ఫార్ములా ఇప్పుడు వర్తించదని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కూడా తాము సీట్ల విషయంలో వెనక్కి తగ్గుతామని అనుకుంటే పొరపాటని ఆయన తేల్చి చెప్పారు.
కష్టపడే వారికి జనసేన అవకాశాలు కల్పిస్తుంది
ఇప్పటికే దీని గురించి పలు పత్రికలు, ఛానల్స్ లో జనసేన పొత్తులు, భవిష్యత్తుపై వార్తలు ప్రచారం అవుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడి పనిచేసిన జనసైనికులకు, నాయకులకు ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తగిన ప్రాధాన్యత, అవకాశాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కూటమిలోని ఇతర మిత్రపక్షాలతో తగిన సమన్వయం చేసుకుంటూనే, జనసేన శ్రేణులంతా ఎన్నికలకు సంపూర్ణంగా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం జనసేన పార్టీ తగ్గుతుందని పవన్ కళ్యాణ్ అన్నారని, ఆ మాట మేరకు మేం వ్యవహరించామన్నారు. కూటమిని బలపరిచేందుకు ఆ రోజు అది సరైన నిర్ణయమని భావించామని, రాబోయే రోజుల్లో ఇదే తీరుగా ఉంటామనుకోవద్దని, కూటమిలో ఆ పొత్తు కొనసాగుతుందని భావించొద్దని తేల్చి చెప్పారు. రాబోయే రోజుల్లో జరిగే ఎన్నికల్లో తాము పట్టు ఉన్న చోట్ల సొంతంగా బరిలోకి దిగి ఫలితాలు రాబట్టాలని భావిస్తున్నామని తేల్చేశారు. ఈ మేరకు పలు జిల్లాల నుంచి స్థానిక నేతల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయన్నాయని, జనసేన నేతలు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల కోసం నిలబడాలని పిలుపునిచ్చారు. యువత, మహిళలు రాజకీయాల్లోకి వచ్చి రాణించాలని. కష్టపడి పనిచేసే వారికి అవకాశాలు తప్పకుండా ఉంటాయని హామీ ఇచ్చారు.



# ధరణి అక్రమాలపై సిట్

అమలులోకి వచ్చిన ధరణి పోర్టల్ నిర్వహణ, అందులో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలు, భూ లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ధరణి పోర్టల్‌లో గత కొన్నేళ్లుగా నమోదైన లోపాలు, భూముల యాజమాన్య మార్పులు, అక్రమ రిజిస్ట్రేషన్లు, భూ ఆక్రమణలు, వివాదాస్పద లావాదేవీలన్నింటినీ సిట్ క్షుణ్ణంగా పరిశీలించనుంది. ఎవరి భూములు ఎలా చేతులు మారాయి, ఏ అధికారుల పాత్ర ఉంది, నిబంధనల ఉల్లంఘనలు జరిగాయా అనే అంశాలపై ఆధారాలు సేకరించి సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విద్యారంగానికి సంబంధించిన కీలక అంశాలపై కూడా మంత్రివర్గం నిర్ణయాలు తీసుకుంది. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే జగిత్యాల జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవసరమైన పోస్టులను భర్తీ చేయడానికి కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో విద్యాసంస్థల్లో సిబ్బంది కొరతను తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి కూడా పలు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. సంగారెడ్డి జిల్లాలో వివిధ ప్రభుత్వ సంస్థలకు భూ కేటాయింపులకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. పటాన్‌చెరు ప్రాంతంలో డబుల్ బెడ్‌రూమ్ గృహాల నిర్మాణానికి అనుమతి ఇవ్వడంతో పాటు, పట్టణ పేదలకు గృహాల కల్పనను వేగవంతం చేయాలని నిర్ణయించింది.

**పాలమూరు అంచనాలకు ఆమోదం**
నీటిపారుదల రంగంలో కీలకమైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పెరిగిన వ్యయ అంచనాలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి సాగునీటి లక్ష్యాలను సాధించే దిశగా చర్యలు కొనసాగించాలని నిర్ణయించింది. అలాగే రాష్ట్రంలో ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు సంబంధించిన అలైన్‌మెంట్ మార్పులకు కూడా ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గ్రామీణాభివృద్ధికి సంబంధించి గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని పెంపొందించే నిర్ణయాలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. పంచాయతీలకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ స్థానిక సంస్థల ఆదాయ వనరులను బలోపేతం చేసే చర్యలకు మంత్రివర్గం మద్దతు తెలిపింది. ధరణి పోర్టల్‌పై సిట్ ఏర్పాటు నుంచి విద్య, నీటిపారుదల, గృహ నిర్మాణం, గ్రామ పంచాయతీలు, మౌలిక సదుపాయాల వరకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్న ఈ మంత్రివర్గ సమావేశం రాష్ట్ర పరిపాలనలో కీలక మలుపుగా మారింది.




# మౌలానా వ్యాఖ్యలపై వివాదం

- **యూపీలో ఎఫ్ఐఆర్ నమోదు.**
- **నాలుక కోసిన వారికి రూ.10 లక్షల బహుమతి ప్రకటనపై మరో వివాదం.**

ఢిల్లీ, మహా: ఉత్తరప్రదేశ్‌లో మతపరమైన వ్యాఖ్యల నేపథ్యంలో మరోసారి వివాదం చెలరేగింది. శ్రీకృష్ణుడిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ముస్లిం మత గురువు మౌలానా జర్జిస్ అన్సారీపై లక్నోలో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇదే వ్యవహారంపై స్పందించిన ఓ హిందూ మత గురువు, అన్సారీపై తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో వివాదం మరింత ముదిరింది. ఆయన చేసిన బహుమతి ప్రకటన కూడా చట్టపరమైన చర్చకు దారితీసింది. జార్ఖండ్‌లో జరిగిన ఓ మత సభలో మౌలానా జర్జిస్ అన్సారీ మాట్లాడుతూ, శ్రీకృష్ణుడు రోజుకు ఐదు సార్లు నమాజ్ చేసేవారని, ఆయన ముస్లింగా ఉన్నారని వ్యాఖ్యానించినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోలో కనిపిస్తోంది. వైరల్ అవుతున్న వీడియో పాతదేనని సమాచారం ఉన్నప్పటికీ, ఇటీవల అది మళ్లీ విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో ఈ అంశం తీవ్ర చర్చకు దారి తీసింది. తన వ్యాఖ్యలకు మద్దతుగా భగవద్గీత ఆరో అధ్యాయం పదో శ్లోకాన్ని అన్సారీ ప్రస్తావించారు. ఆ శ్లోకాన్ని తనదైన రీతిలో వ్యాఖ్యానిస్తూ హిందూ గ్రంథాల్లో కూడా ఇస్లామీయ బోధనలు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే సంస్కృత పండితులు, హిందూ మత సంస్థలు ఈ వ్యాఖ్యానాన్ని తీవ్రంగా ఖండించాయి. భగవద్గీతలోని సంబంధిత శ్లోకంలో అలాంటి అర్థం ఎక్కడా లేదని, పవిత్ర గ్రంథాన్ని వక్రీకరించి మతపరమైన అపోహలు సృష్టించే ప్రయత్నం చేశారని ఆరోపించాయి.ఈ వ్యాఖ్యలపై హిందూ సంస్థలు లక్నోలో పోలీసులకు ఫిర్యాదు చేశాయి. విద్వేషాన్ని రెచ్చగొట్టడం, మతపరమైన మనోభావాలను దెబ్బతీయడం తదితర ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో లభించే ఆధారాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ఈ వివాదం మధ్య అయోధ్యలో మీడియాతో మాట్లాడిన మహామండలేశ్వర్ విష్ణుదాస్, మౌలానా అన్సారీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. శ్రీకృష్ణుడిని అవమానించేలా మాట్లాడారని, భగవద్గీత శ్లోకాలను తప్పుగా వ్యాఖ్యానించారని ఆరోపించారు. అదే సమయంలో, అన్సారీపై హింసను ప్రేరేపించేలా భావించబడే బహుమతి ప్రకటన చేయడం కూడా తీవ్ర వివాదానికి దారితీసింది. ఆ ప్రకటనపై కూడా చట్టపరమైన పరిశీలన కొనసాగుతోంది. హింసకు ప్రేరేపించడం లేదా నేరానికి ఉసిగొల్పడం వంటి నిబంధనల కింద చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందా అనే అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. మరోవైపు, మౌలానా జర్జిస్ అన్సారీ గతంలో కూడా పలు మత, సామాజిక అంశాలపై చేసిన వ్యాఖ్యలు వివాదాలకు కారణమైనట్లు గుర్తుచేస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో మతపరమైన అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, శాంతి భద్రతలకు భంగం కలిగించే లేదా మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఎవరూ చేయరాదని న్యాయ నిపుణులు, సామాజిక వర్గాలు సూచిస్తున్నాయి. దర్యాప్తు పూర్తయిన తర్వాత వాస్తవాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

# విశ్వకుటుంబంగా మారుతున్న భారత్

**హైదరాబాద్, మహా.** *భారతదేశం అనాదిగా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. ఒకప్పుడు ఉపాధి కోసం భారతీయులు విదేశాలకు వలస వెళ్లడం గురించే మనం ఎక్కువగా చర్చించుకునేవాళ్లం. కానీ, మారుతున్న ఆధునిక ప్రపంచ చిత్రపటంలో భారతదేశం కూడా ఎందరో విదేశీయులకు ఆశ్రయం కల్పిస్తున్న అక్షయపాత్రగా మారుతోంది. కేవలం సరిహద్దు దేశాల ప్రజలే కాకుండా, అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలకు చెందిన వేలాది మంది నిపుణులు సైతం మన దేశాన్ని తమ నివాసంగా మలచుకుంటున్నారు. భారత్ అధికారికంగా విదేశీ నివాసితుల సమగ్ర జాబితాను ప్రకటించనప్పటికీ, తాజా అంచనాల ప్రకారం టాప్ 20 దేశాల గణాంకాలను విశ్లేషిస్తే.. భారత్ క్రమంగా ఒక మినీ ప్రపంచంగా రూపాంతరం చెందుతున్న తీరు కళ్లకు కడుతుంది.*

భారతదేశంలో నివసిస్తున్న విదేశీయుల జాబితాను పరిశీలిస్తే, మన పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఉపాధి అన్వేషణ, భౌగోళిక సామీప్యత కారణంగా సుమారు 3.5 మిలియన్ల (35 లక్షలు) నుంచి 5.0 మిలియన్ల (50 లక్షలు) మంది బంగ్లాదేశీయులు భారత్‌లో ఉంటున్నట్లు అంచనా. ఆ తర్వాతి స్థానంలో ఇరు దేశాల మధ్య ఉన్న సుహృద్భావ, ఓపెన్ బోర్డర్ విధానం కారణంగా 2.5 మిలియన్ల (25 లక్షలు) నుంచి 3.5 మిలియన్ల (35 లక్షలు) మంది నేపాలీయులు మన దేశంలో నిరభ్యంతరంగా ప్రవేశించి వివిధ రంగాల్లో స్థిరపడుతున్నారు. అసంఘటిత రంగంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఆర్థిక అవసరాలు పక్కన పెడితే, రాజకీయ అస్థిరత, ప్రాణభయంతో శరణార్థులుగా వచ్చినవారికి భారత్ ఎప్పుడూ పెద్దదిక్కుగానే ఉంటోంది. చైనా ఆక్రమణ తర్వాత టిబెట్ ప్రాంతం నుంచి వచ్చిన 70 వేల నుంచి 90 వేల మందికి హిమాచల్ ప్రదేశ్ తదితర ప్రాంతాల్లో ఆశ్రయం లభించింది. అదేవిధంగా, మయన్మార్‌లో సైనిక పాలన, అంతర్గత హింసను తాళలేక వచ్చిన 50 వేల నుంచి 70 వేల మంది ప్రజలు, శ్రీలంకలోని పరిస్థితుల కారణంగా వలసవచ్చిన 40 వేల నుంచి 60 వేల మంది శరణార్థులు ఇక్కడ ప్రశాంత జీవనం గడుపుతున్నారు. అఫ్ఘానిస్తాన్‌లోని అస్థిర పరిస్థితుల నుంచి తప్పించుకుని వచ్చిన 20 వేల నుంచి 30 వేల మంది పౌరులతో పాటు, పొరుగునే ఉన్న ప్రశాంత దేశం భూటాన్ నుంచి సైతం విద్యా, వాణిజ్య ప్రయోజనాల కోసం 20 వేల నుంచి 30 వేల మంది ఇక్కడ నివసిస్తుండటం విశేషం.

వలసల ముఖచిత్రంలో అత్యంత ఆసక్తికరమైన మలుపు పాశ్చాత్య, ఆఫ్రికన్ దేశాల పౌరుల రాక. ప్రపంచ అగ్రరాజ్యమైన యునైటెడ్ స్టేట్స్ (అమెరికా) నుంచి ఏకంగా 15 వేల నుంచి 20 వేల మంది




నిపుణులు, దౌత్యవేత్తలు భారత్‌లో నివాసముంటున్నారు. అదే సమయంలో ఆఫ్రికా ఖండం నుంచి ఉన్నత విద్య, వ్యాపారాల నిమిత్తం నైజీరియా పౌరులు కూడా 15 వేల నుంచి 20 వేల మంది ఇక్కడ ఉంటున్నారు. ఇక కార్పొరేట్ రంగంలో విశేష సేవలు అందిస్తున్న బ్రిటన్ (యునైటెడ్ కింగ్‌డమ్) నుంచి 10 వేల నుంచి 15 వేల మంది, అలాగే రష్యా నుంచి మరో 10 వేల నుంచి 15 వేల మంది పౌరులు మన దేశంలో స్థిరపడటం గ్లోబల్ ఎకనామిక్ పవర్‌హౌస్‌గా ఎదుగుతున్న భారత్ సత్తాకు అద్దం పడుతోంది.

ఈ విదేశీ నివాసితుల జాబితా ఐరోపా, ఆసియాపసిఫిక్ దేశాలకు కూడా విస్తరించింwది. ఐరోపాలో ఆర్థికంగా బలమైన జర్మనీ నుంచి 8 వేల నుంచి 12 వేల మంది, ఫ్రాన్స్ నుంచి 7 వేల నుంచి 10 వేల మంది, ఇటలీ నుంచి 3 వేల నుంచి 5 వేల మంది వరకు పౌరులు భారత్‌లోని బహుళజాతి కంపెనీలు, దౌత్య కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. ఇక ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో భారీ పెట్టుబడులు పెడుతున్న జపాన్ నుంచి 6 వేల నుంచి 8 వేల మంది, దక్షిణ కొరియా నుంచి 5 వేల నుంచి 8 వేల మంది, చైనా నుంచి కూడా 5 వేల నుంచి 8 వేల మంది నిపుణులు భారత్‌ను తమ వేదికగా చేసుకున్నారు. వీరికి తోడుగా కెనడాకు చెందిన 4 వేల నుంచి 7 వేల మంది, ఆస్ట్రేలియా నుంచి 3 వేల నుంచి 5 వేల మంది, పశ్చిమాసియాలోని ఇరాన్ నుంచి 2 వేల నుంచి 4 వేల మంది వివిధ రంగాల్లో స్థిరపడ్డారు.

ఈ అంచనాలు కేవలం సుమారు లెక్కలు మాత్రమే. ముఖ్యంగా బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల గణాంకాల్లో సరైన పత్రాలు లేని వలసలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్యలు గణనీయంగా మారే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఏది ఏమైనా.. ఒకవైపు పొరుగు దేశాల పేదలకు అక్కున చేర్చుకుని జీవనాధారం కల్పిస్తూనే, మరోవైపు అభివృద్ధి చెందిన దేశాల నిపుణులకు అనువైన కార్పొరేట్ వేదికగా మారుతున్న భారతదేశం.. భవిష్యత్తులో ప్రపంచ దేశాల పౌరులందరికీ అతిపెద్ద గమ్యస్థానంగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.



# నాణ్యమైన స్కూల్ యూనిఫాంల ను విద్యార్థులకు అందించాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, బ్యూరో మహా** ;ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యతతో కూడిన యూనిఫాం లను అందజేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుట్టింపు పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.శుక్రవారం సంగెం మండలంలోని శాంతి మండల సమాఖ్య ను సందర్శించిన జిల్లా కలెక్టర్, మహిళా సంఘాల సభ్యులు చేపడుతున్న యూనిఫాంల కుట్టింపు ప్రక్రియను పరిశీలించారు.యూనిఫాంల నాణ్యత, కొలతలు, పనుల పురోగతిపై ఆరా తీసి, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి యూనిఫాం ను తయారు చేయాలని సూచించారు.. విద్యార్థులకు సరైన కొలతలతో, యూనిఫాం లను సకాలంలో అందేలా కుట్టింపు పనులను వేగవంతం చేయాలని అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులకు ఆదేశించారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, యూనిఫాం ల తయారీ, పంపిణీ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారిని ఆదేశించారు. ఈ సందర్శనలో డి ఆర్ డి ఓ నాగ పద్మజ, సంఘం తహసిల్దార్ రాజ్ కుమార్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# ఫిఫా ఫీవర్‌కు తెలంగాణ సర్కార్ గ్రీన్‌సిగ్నల్

**బార్ల పనివేళలు పొడిగింపు**

**హైదరాబాద్, మహా :** ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను అలరిస్తున్న ఫిఫా వరల్డ్ కప్-2026 తుది దశకు చేరుకున్న వేళ తెలంగాణ ప్రభుత్వం ఫుట్‌బాల్ అభిమానులకు శుభవార్త చెప్పింది. జూలై 18న మూడో స్థానం కోసం ఫ్రాన్స్-ఇంగ్లండ్ మధ్య జరిగే మ్యాచ్, జూలై 19న స్పెయిన్-అర్జెంటీనా మధ్య జరగనున్న ప్రతిష్ఠాత్మక ఫైనల్‌ను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ నగర పరిధిలోని బార్ల పనివేళలను పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు లభించడంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.ఉత్తర్వుల ప్రకారం జూలై 18, 19 తేదీల్లో ఫిఫా వరల్డ్ కప్ మ్యాచ్‌ల సందర్భంగా లైసెన్స్ పొందిన బార్లు, క్లబ్బులు, టూరిజం బార్లు, మైక్రోబ్రూవరీలు సాధారణ సమయం కంటే ఎక్కువసేపు తెరిచి ఉంచేందుకు అనుమతి కల్పించారు. జూలై 18 అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున 4:30 గంటల వరకు, అలాగే జూలై 19న జరిగే గ్రాండ్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా 19-20 మధ్య రాత్రి 3:00 గంటల వరకు మద్యం విక్రయాలు నిర్వహించేందుకు ప్రత్యేక వెసులుబాటు కల్పించారు.ఈ ప్రత్యేక అనుమతి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధిలోని లైసెన్స్ పొందిన 2B బార్లు, C1 క్లబ్బులు, TD1, TD2 టూరిజం బార్లు, మైక్రోబ్రూవరీలకు మాత్రమే వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇతర ప్రాంతాల్లో లేదా అనుమతి లేని సంస్థలకు ఈ వెసులుబాటు వర్తించదని ఎక్సైజ్ శాఖ పేర్కొంది.

ఫిఫా వరల్డ్ కప్ కీలక మ్యాచ్‌లను హోటళ్లు, పబ్‌లు, రెస్టారెంట్లలో భారీ ఎత్తున లైవ్ స్క్రీనింగ్ ద్వారా వీక్షించేందుకు వీలుగా బార్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. అభిమానుల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని, పర్యాటక రంగానికి ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

అయితే పొడిగించిన సమయాలను దుర్వినియోగం చేయరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అనుమతించిన సమయం దాటిన తర్వాత ఎలాంటి విక్రయాలు నిర్వహించకూడదని, శాంతిభద్రతలకు భంగం కలగకుండా అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎక్సైజ్ శాఖ, పోలీసు అధికారులు బార్ యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించారు.ఫిఫా వరల్డ్ కప్ ముగింపు మ్యాచ్‌ల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఫుట్‌బాల్ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ముఖ్యంగా హైదరాబాద్‌లోని హోటళ్లు, పబ్‌లు, స్పోర్ట్స్ లాంజ్‌లలో భారీ సంఖ్యలో అభిమానులు మ్యాచ్‌లను వీక్షించే అవకాశం ఉండటంతో, నగరంలో మరోసారి ఫుట్‌బాల్ సందడి నెలకొననుంది.

# ఆరుట్లలో సిసి రోడ్డు పనులను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**ఇబ్రహీంపట్నం జూలై 17 మహా:** ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభానికి సీఎం రేవంత్ రెడ్డి వచ్చిన సందర్భంలో స్పెషల్ నిధుల నుండి ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన నిధులతో ఆరుట్ల సుందరయ్య నగర్ లో వేగంగా నడుస్తున్న సిసి రోడ్డు పనులను ఆరుట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఆరుట్ల గ్రామ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, మాజీ ఎంపిటిసి లాలగారి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మార సురేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ, కంబాలపల్లి బుగ్గరాములు, కోరె బాబు, కాంగ్రెస్ నాయకులు లచ్చగారి జంగారెడ్డి, పంబాల కిషోర్, ఎండి అశ్రఫ్, ఆర్ల బీరుమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు వేగవంతం చేయాలి

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు వేగవంతం చేయాలని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం నుంచి సంబంధిత జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ పలు అభివృద్ధి, ప్రజారోగ్య అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు, ప్రీప్రైమరీ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, తెలంగాణ మోడల్ స్కూళ్లలో విద్యార్థుల నమోదును మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఆసుపత్రుల్లో మందులు, పరీక్షా కిట్లు, వైద్య సిబ్బంది, అంబులెన్స్ సేవలు, అత్యవసర వైద్య సౌకర్యాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

**ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువ!**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. వానాకాల వ్యవసాయ సీజన్ దృష్ట్యా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని, రైతు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె. కిరణ్మయి, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ అధికారులు, ఎంఈఓలు, ఏఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర నిధులతోనే తెలంగాణలో అభివృద్ధి

**సిరిసిల్ల, మహా :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులను కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతభత్యాలకు మళ్లించడం దుర్మార్గమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సర్పంచులను బెదిరించి, ఒత్తిడి తెస్తోందన్నారు. ''అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులను కరెంట్ బిల్లులు, జీతాలకు ఎట్లా మళ్లిస్తారు? ఇది నిబంధనలకు విరుద్ధం. రాష్ట్ర ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే కేంద్రానికి లేఖ రాయాల్సి ఉంటుంది. అవసరమైతే ఆర్థిక సంఘం నిధులు నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తాం''అని చెప్పారు. గ్రామ పంచాయతీల కరెంట్ బిల్లులు, సిబ్బంది జీత భత్యాలకు కూడా నిధులివ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందా? అని మండిపడ్డారు. సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ శుక్రవారం అమృత్ 2 స్కీం కింద రూ.105 కోట్ల నిధుల అంచనా వ్యయంతో చేపట్టిన కార్గిల్ చెరువు పునరుద్దరణ, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. పక్కనే ఉన్న కార్గిల్ యుద్ధ శకటాన్ని సందర్శించారు. కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్లకు నివాళులు అర్పించారు. అమృత్ 2 స్కీం కింద రూ.1.32 కోట్లతో కార్గిల్ చెరువు పునరుద్దరణ, సుందరీకరణ పనులు చేపట్టి ఈ చెరువును సుందరంగా తీర్చిదిద్దుతామని, మురుగునీరు రాకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. అమృత్ కింద కేంద్రం పెద్ద ఎత్తున నిధులిస్తున్నా గడువులోగా పనులు చేయడం లేదని మంత్రి మండిపడ్డారు. దీనివల్ల నిధులు వెనక్కు వెళ్లే



ప్రమాదముందన్నారు. గొప్ప ఆశయంతో అమృత్ స్కీంను ప్రధాని మోదీ ప్రవేశపెట్టారని, పట్టణాల్లో ప్రతి ఇంటికి నూటికి నూరు శాతం నల్లా కనెక్షన్ అందించడంతోపాటు మురుగునీటి (సీవరేజ్) సౌకర్యం కల్పించడం, పట్టణాలను వాటర్ సెక్యూర్ సిటీస్ గా తీర్చిదిద్దాలనే గొప్ప లక్ష్యంతో 2015లో అమృత్ పథకాన్ని ప్రారంభించారన్నారు. అమృత్ 1 మిషన్ కింద రూ.77 వేల 640 కోట్ల వ్యయం అంచనా వేస్తే కేంద్రం 35 వేల 990 కోట్లు కేటాయించింది. 2021 నాటికి అమృత్ 1 స్కీం పూర్తయ్యింది. ఆ తరువాత 2021 అక్టోబర్ లో అమృత్ 2 స్కీం పేరుతో 2 లక్షల 99 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తే, అందులో కేంద్రం తన వాటాగా 76 వేల 760 కోట్లు కేటాయించిందన్నారు.

అమృత్ 1 కింద 1660 కోట్లు, అమృత్ 2 కింద 3వేల 429 కోట్ల రూపాయలను తెలంగాణకు కేంద్రం కేటాయించగా, కరీంనగర్ పార్లమెంట్ కు సంబంధించి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు సిరిసిల్ల, వేములవాడ, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీలు అమృత్ పథకం కింద దాదాపు 400 కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. అందులో సిరిసిల్ల మున్సిపాలిటీకి 105 కోట్ల 57 లక్షల రూపాయలను ఖర్చు చేస్తున్నాంమని మంత్రి చెప్పారు. 12 ఏళ్లలో 13 లక్షల కోట్ల రూపాయలను తెలంగామ అభివృద్ధి కోసం ఖర్చు చేసిందని, అయినా కేంద్రం ఏమిచ్చింది? తెలంగాణకు అన్యాయం చేస్తుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పచ్చి అబద్ధాలాడుతున్నరన్నారు. అసలు తెలంగాణలో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతుందంటే కేంద్రం ఇస్తున్న నిధులే కారణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా నయాపైసా కూడా మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు ఇవ్వలేదన్నారు. సిరిసిల్ల పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా నయాపైసా ఇయ్యలేని, మోదీ ప్రభుత్వం వివిధ స్కీంల కింద నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. అమృత్ స్కీం కింద కేంద్రం నిధులిస్తుంటే వాటిని అభిమృద్ధి పనులకు కాకుండా కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతాల కోసం ఖర్చు చేస్తూ నిధులను డైవర్ట్ చేస్తున్నారన్నారు. కేంద్రం ఏ ఉద్దేశంతో నిధులిస్తుందో... ఆ లక్ష్యానికే ఉపయోగించాలి. లేనిపక్షంలో ఆ నిధులను దారి మళ్లిస్తే మాత్రం ఊరుకునేది లేదని మంత్రి హెచ్చరించారు. ప్రభుత్వం తీరు మారకుండా కేంద్రానికి లేఖ రాస్తే నిధులు ఆగిపోయే ప్రమాదముందన్నారు. అదే సమయంలో కేంద్ర నిధులను నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని, సిబ్బంది జీతభత్యాలు, కరెంట్ బిల్లులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం పైసలియ్యకపోతే ఎట్లా? కేంద్రం నిధులను దారి మళ్లించడం నిబంధనలకు పూర్తి విరుద్ధమన్నారు. సర్పంచులను బెదిరించి సిబ్బంది జీతాలకు కేంద్ర నిధులను ఎట్లా ఖర్చు చేస్తారు? ఇకనైనా తీరు మార్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ కోరారు.

## యువ సంగ్రామ సదస్సు విజయవంతానికి సన్నాహక సమావేశం

- **సరూర్‌నగర్ యువ సంగ్రామ సదస్సుపై ఉప్పల్‌లో సన్నాహక సమావేశం**
- **యువత సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్న ఎమ్మెల్యే బండారు**

**కుషాయిగూడ, మహా :** సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సును విజయవంతం చేయడానికి డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "యూత్ డిక్లరేషన్" పేరుతో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. యువత సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, తమ హక్కుల సాధన కోసం యువ సంగ్రామ సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, నిరుద్యోగ యువత తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ సభ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, యువత, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు, కొత్త రామారావు గొల్లూరి అంజయ్య జేరిపోతుల ప్రభుదాస్ గుండారపు శ్రీనివాసరెడ్డి పన్నాల దేవేందర్ రెడ్డి సాయి జెన్ శేఖర్ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి నేమూరి మహేష్‌గౌడ్ బుచ్చన్నగారి శ్రీకాంత్ రెడ్డి సప్పిడి శ్రీనివాస్ రెడ్డి కాసం మైపాల్ రెడ్డి మురళి పంతులు వంజరి ప్రవీణ్ కరిపే బైరి నవీన్ గౌడ్ ఇంద్రయ్య ఎంకే బద్రుద్దీన్ మహేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సబితా ఇంద్రారెడ్డి మంత్రిగా ఉండి బహదూర్ గూడా రైతులకు ఏం ఒరగబెట్టింది

- **బిఆర్ఎస్ పార్టీ రైతులపై మొసలి కన్నీరు కారుస్తుంది..**
- **కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జెల్ పల్లి నరేందర్..**

**రాజేంద్రనగర్ మహా ;** సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నర్కుడాలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జెల్ పల్లి నరేందర్, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.జెల్ పల్లి నరేందర్ మాట్లాడుతూ జిల్లా మంత్రిగా గత పది ఏళ్ళు మీరే శాసించారు. మీ కుటుంబ సభ్యులే జిల్లాలో ముఖ్య పాత్ర పోషించారు. దశాబ్దాల తరబడి మంత్రిగా ఉండి బహుదూ గూడా రైతులకు ఏం ఒరగబెట్టారని కార్తీక్ రెడ్డి మళ్లీ రైతుల వద్దకు వచ్చారు. బహదూర్ గూడా భూములపై ఆనాడే మాట్లాడలేక పోయారు. ఆనాడే పట్టా పాస్పుక్కులు ఇచ్చి ఉంటే, బహదూర్ గూడ రైతులు శవయాత్ర నిర్వహించేవారా.బహదూర్ గూడ రైతులపై మొసలి కన్నీరు కారు



స్తున్నారు.దశాబ్దాలుగా రాజకీయాలో తమ వారసులే ఉండాలా, బీసీ నాయకుని ఎమ్మెల్యేగా ఉండడాన్ని చూసి ఓర్వలేకే కార్తీక్ రెడ్డి అవాక్కులు చవాకులు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్, గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు 70 సంవత్సరాలుగా కాపాడుకున్న వ్యవసాయ భూములను వదలాలంటే ఎవరికైనా బాధనిపిస్తుంది. రాష్ట్రాల అభివృద్ధి కోసం భూ సేకరణ తప్పనిసరి అయింది. రైతులకు 500 గజాల నుండి 800 గజాల వరకు రైతులకు నష్ట పరిహారం కింద ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించి అందించే ప్రయత్నం చేస్తామన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి అవకాశమే లేదు. మరోసారి తెలంగాణలో రాజేంద్రనగర్ లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల పేరుతో తెలంగాణ ప్రజలను దోచుకొని తిన్నారు. నియోజకవర్గంలో ఎక్కడైనా డబల్ బెడ్ రూమ్ లను కట్టారా, శంషాబాద్ మండలంలో ఎనిమిది మందికి డబల్ బెడ్ రూమ్ లు ఇచ్చి సంకలు ఎగరేశారు. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇల్లు ఇస్తేనే మళ్లీ ఓట్లు అడుగుతనని అన్నారు. ఆ ధైర్యం బిఆర్ఎస్ పార్టీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకుపోతుంటే చూసి ఓర్వలేకే రైతులను రెచ్చగొడుతున్నారు.బహదూర్ గూడా రైతులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాటలు నమ్మరు. కాంగ్రెస్ పార్టీతోనే వారికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజయ్ యాదవ్, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## ఇసుక డంపింగ్ పై చర్యలు తీసుకోవాలి..

**రాజేంద్రనగర్ మహా ;** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి కొందరు వ్యాపారస్తులు ఇసుకను 50 నుంచి 70 టన్నుల వరకు తెస్తూ, శంషాబాద్ లోని ప్రభుత్వ భూములను డంపింగ్ కేంద్రాలుగా మార్చుకొని, పరిసర ప్రాంతాలకు ఇసుకను అమ్ముకుంటున్నారు. దీంతో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు (ఇసుక లారీ యజమానులు ) తెలంగాణ ప్రభుత్వం నుండి వే బిల్ పొంది 35 టానులకు మించకుండా రవాణా చేస్తూ, శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో అమ్ముదామంటే కొనేవారు లేక ఉపాధిని కోల్పోతున్నాం ఇసుకను అక్రమంగా చట్ట విరుద్ధంగాప్రభుత్వ భూములలో నిలువ చేస్తూ అక్రమ లావాదేవీలు జరుపుతున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని మండల తాసిల్దార్ అమరలింగం గౌడ్ ను శంషాబాద్ లారీ యజమానుల సంఘం శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కృషి చేయాలి: ఎమ్మెల్యే రంగారెడ్డి

- **మాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు ఉపాధ్యాయ ఎన్నిక**
- **ఎమ్మెల్యే రంగారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేత**

**ఇబ్రహీంపట్నం జూలై 17 మహా:** క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే రంగారెడ్డి పిలుపునిచ్చాడు. మాల్ గ్రామ కాంగ్రెస్ కమిటీ సభ్యులకు, ఎమ్మెల్యే రంగారెడ్డి నియామక పత్రాలు అందజేశారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీశైలం ఆధ్వర్యంలో, మాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, అధ్యక్ష ఉపాధ్యక్షులైన దొంతమోని శ్రీకాంత్ గౌడ్, పాక భాస్కర్ యాదవ్ లకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయడం జరిగింది. గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా దేరంగుల రమేష్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతకు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని కార్యకర్తలకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడప గడపకు తీసుకెళ్లాలి అర్హులందరికీ



రెండో దప ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అందిస్తాం అని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పనిచేయాలి, నియామక పత్రాలు అందుకున్న కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీకాంత్ ను ఎమ్మెల్యే అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే వారికి దిశా నిర్దేశం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. ప్రతి పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. పార్టీ ప్రతిష్ట గురించి పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కొరకు పని చేసే నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామంలో నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని, అంతే కాకుండా పార్టీ బలోపేతానికి అహర్నిశలు పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జీవన సమరం

అంతా భారం... తెల్లవారితోంది అంటేనే ఏదో భయం. ఇంటికి బంధువులు, మిత్రులు వస్తున్నారు అంటే కంగారు. ఈ రోజు గడపటం ఎలా అనే ఆలోచనలు.. జేబులో చేయి పెట్టాలి అంటే సందేహం. ఇది ఇప్పుడు సగటు జీవి నిత్య సంఘర్షణ. బతుకునావ ధరల కెరటాల ఉధృతికి కొట్టుకుపోతోంది. ఏం కొనాలి అంటే ఒకటికి వంద సార్లు లెక్కలు వేసుకోవాలి. ఏది తినాలి అన్నా లోతుగా ఆలోచించాలి. వినోదాలు, సరదాలు ఎప్పుడో పక్కన పెట్టేసినా ఇంటి బడ్జెట్ తడిసి మోపెడు అవుతూనే వుంది. ఎప్పుడు ఈ నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి దాడి చేస్తాయో అర్థం కావట్లేదు. అర్థమైన చేసేది కూడా ఏమి లేదు. ఇలా ఎంత కాలం, ఎంత దూరం. వచ్చిన జీతం రాళ్లు పది రోజులకు కూడా సరిపోవటం లేదు. అప్పులు కుప్పలుగా పెరిగిపోతున్నాయి. నెల సరి ఇంటి బడ్జెట్ తడిసి మోపెడు అవుతూనే వుంది. ధరల పెరుగుదల చక్రబంధంలో సామాన్య జీవులు చిక్కుకుని విల విల లాడుతున్నారు. పల్లెలు, మొదలుకుని పట్టణ వాసుల వరకు ఇదే సమస్యతో అల్లాడుతున్నారు. పల్లెల్లో బతుకు బండి లాగాలి అంటే నెలకు కనీసం 20 వేల రూపాయలు ఖర్చు అవుతోంది. ఇక పట్టణాల్లో భార్య, భర్త మాత్రమే వున్న ఫ్యామిలీలో 70 నుంచి 80 వేలు, దంపతులతో పాటు ఒకరో, ఇద్దరో పిల్లలు ఉంటే సుమారు లక్ష రూపాయల వరకు నెల సరి ఖర్చు తప్పనిసరిగా ఉంటోంది. వస్తున్న జీతాలు, పెరుగుతున్న ఖర్చులకు అసలు పొంతనం ఉండటం లేదు. భార్య, భర్త ఇద్దరు ఉద్యోగాలు చేస్తున్నా సగటున లక్ష నుంచి అయిదు లక్షల వరకు అప్పులు ఆ కుటుంబం పైన ఉంటునట్టు తాజాగా జరిగిన కుటుంబ సర్వే లెక్కలు తేల్చింది. రోజు, రోజుకు జీవన వ్యయం పెరగటమే తప్పా ఎక్కడ ఆగటం లేదు. ఇందుకు కారణాలు ఏవైనా ఆర్థిక ఇక్కట్లు ఎదుర్కొంటున్నది మాత్రం సామాన్య జనమే.

భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశం పరుగులు తీస్తోందని కేంద్రం అంటోంది. ఏ లెక్కల ప్రకారం ఈ ప్రగతి సాధన అంచనా వేస్తున్నారు అన్నది పక్కన పెడితే సామాన్య జనం పైన జీవన వ్యయం అంతకంతకు పెరిగి పోతోంది అన్నది నిజం. దేశంలో 46 శాతం మంది ఉద్యోగాలు చేసుకుంటూ జీవితాలు సాగిస్తున్నారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు పది శాతం మేరకు వున్నారు. పది శాతం ఉద్యోగుల్లో నెలకు కనీసం 60 నుంచి 70 వేల రూపాయల జీతాలు అందుకుంటున్న ఉద్యోగులు అయిదు నుంచి ఆరు శాతం ఉండగా ఓ రెండు శాతం మంది ఉద్యోగులు లక్షన్నర మేరకు జీతాలు అందుకుంటున్నారు. ఇక ప్రైవేట్ సెక్టార్ లో పని చేస్తున్న వారు 22 శాతం వున్నారు. వీరిలో సాఫ్ట్ వేర్, ఐటీ ఉద్యోగాలు చేస్తున్న వారు 12 శాతం ఉండగా వారిలో 6 శాతం మంది ఉద్యోగులకు లక్షకు పైగా జీతాలు వస్తున్నట్లు ఓ సర్వే తెలిపింది. మిగిలిన ఆరు శాతం మంది ఉద్యోగులు పేరుకు సాఫ్ట్ వేర్ ఉద్యోగులు అయినా జీతాలు 35 వేల నుంచి 85 వేలలోపే వుంటున్నాయట. దేశంలో భారీ వ్యాపారం చేసే వారి శాతం అయిదుగా చెప్పుకొచ్చిన సర్వే అరకొర వ్యాపారం చేసే వారు ఎక్కువగా ఉన్నట్టు తెలిపింది. వీరి నెలసరి ఆదాయం 30 నుంచి 60 వేలు ఆ పైన ఉంటుందని వివరించింది. మన దేశంలో పల్లె ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న వారి శాతం 58 గా ఉండగా నగరాలు, పట్టణాల్లో జీవనం సాగించే వారు 42 శాతం ఉన్నట్టుగా సర్వే లెక్కలు వేసింది. ఇక పల్లెల్లో జీవనం సాగించే వారిలో వ్యవసాయం చేసే వారు, వ్యవసాయ కూలీలు, ఇతరుల సగటు ఆదాయం నెలకు 15 నుంచి 20 వేల మధ్యలో వుంటుండగా నెలసరి ఖర్చు 25 వేల వరకు వెడుతోందని చెప్పుకొచ్చింది. నగరాలు, పట్టణాల్లో భార్య, భర్త, ఇద్దరు పిల్లలు ఉంటే అయ్యే నెలసరి ఖర్చు 30 నుంచి 40 వేల పై చిలుకు అయితే హైదరాబాద్ వంటి సిటీల్లో 65 నుంచి లక్ష వరకు ఉంటోందట. ముంబై, పూణే, ఢిల్లీల్లో లక్షన్నర లేనిదే కుటుంబం జీవించ లేని పరిస్థితి వుందని తేల్చింది. గడిచిన అయిదు సంవత్సరాల నుండి సగటు జీవి నెలసరి వ్యయం 35 నుంచి 45 శాతం మేరకు పెరిగినట్టు సర్వే లెక్కలు స్పష్టంగా చెప్తున్నాయి.

దేశం వేగంగా ప్రగతి వైపు పరుగులు తీస్తోంది అంటున్నారు పాలకులు. వాస్తవ పరిస్థితి చూస్తే అందుకు విరుద్ధంగా వుంది. అసలు తేడా ఎక్కడ వస్తోంది. ఇదే అందరికి వచ్చే సందేహం. దీనికి అనేక కారణాలున్నాయి. మన దేశం వ్యవసాయ ప్రాధాన్యత దేశం. 56 శాతం మంది వ్యవసాయంపై ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. దీన్ని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయం, దానిపైన ఆధార పడిన రైతులకు సహాయం, సహకారం అందించే పథకాలు ఎన్నో అమలు చేస్తున్నాయి. అయినా రైతు కష్టాలు తీరటం లేదు. వ్యవసాయ పనులు మొదలు పెట్టిన రోజు నుంచి ధాన్యం అమ్మే వరకు దేవుడి మీద భారం వేయక తప్పట్లేదు. దీంతో రైతుల అప్పులు కుప్పలు అవుతున్నాయి. వ్యవసాయ ఆధార కుటుంబ సభ్యులు ఉపాధి కోసం పట్టణ, నగర బాట పడుతున్నారు. ఇక అకాల వర్షాలు, తుపాన్ లు, కరువులు వ్యవసాయంపైన ప్రభావం చూపుతున్నాయి. ప్రజల అవసరం మేరకు నిత్యావసర వస్తువులు మార్కెట్ లోకి రావట్లేదు. ఫలితంగా ధరలు చుక్కలను తాకుతున్నాయి. అవకాశవాదులు దళారుల రూపంలో దోపిడీకి తెగబడుతున్నారు. ఇదే ఇప్పుడు సామాన్య జనం బతుకు బండి బోల్తా పడేలా చేస్తోంది. ఒక్కసారి మార్కెట్ కు వెళ్లి నిత్యావసర వస్తువుల ధరలు పరిశీలిస్తే కంగుతినక తప్పదు. బియ్యం ధరలు బెంబేలు పెడుతున్నాయి. పప్పుల రేట్లు పరేషాన్ చేస్తున్నాయి. ఇక వంటకాల్లో నిత్యం వినియోగించుకునే అల్లం, వెల్లి, ఉల్లి ధరలు భగ్గుమంటున్నాయి. కనీసం టీ, కాఫీ తాగాలన్నా అందులో వాడే చక్కెర ధర కూడా చెట్టు ఎక్కి కూర్చుంది. ఆరోగ్యం కోసం సామాన్య జనం



తినే గుడ్డు రేట్స్ కూడా కొండెక్కి కూస్తున్నాయి. నెల రోజుల్లోనే వీటి రేట్లు రెట్టింపు అయినా ఇంత వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదు. ఒక్కసారిగా ఇంటి బడ్జెట్ పెరిగి పోవటంతో జనం ఇబ్బంది పడే పరిస్థితి వచ్చింది.

ప్రపంచంలోని పలు దేశాల్లో ఏర్పడిన యుద్ధ పరిణామాలు మన దేశం మీద గట్టిగానే ప్రభావం చూపుతున్నాయి. పశ్చిమ ఆసియాలో ఇరాన్ పైన అమెరికా దాడుల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ కొరత దేశం ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది. యుద్ధ ప్రభావం భారత్ పైన ఉండదని మొదట్లో పాలకులు చెప్పినా ఇప్పుడు మాత్రం పెరిగిన ధరలకు యుద్ధానికి లింకు పెడుతున్నారు. విదేశాలలో వచ్చే మార్పులు, చేర్పులు భారత్ పైన పెను ప్రభావం చూపుతున్నాయి. మరో వైపు ఎల్ నినో వేదిస్తోంది. కొన్ని చోట్ల కుంభవృష్టి వర్షాలు అతలాకుతలం చేస్తుండగా, మరి కొన్ని ప్రాంతాలో చుక్క వర్షం లేకుండా పోయింది. ఫలితంగా వ్యవసాయం చతికిల పడింది. ఇప్పుడు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతోనే ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మున్ముందు పరిస్థితి మరింతగా దిగజారే అవకాశం లేకపోలేదని నిపుణులు అంటున్నారు. పాలు, నిత్యావసర వస్తువులు కూరగాయలు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ఇలా అన్నింటి రేట్లు పైపైకి ఎగబాకుతుంటే ఏం చేయాలో తెలీట్లేదని సామాన్య జనం ఆవేదన చెందుతున్నారు. రేట్లు పెరిగినంత వేగంగా జీతం, భత్యం పెరగటం లేదని, ఇప్పుడే ఇలా ఉంటే భవిష్యత్ ఎలా ఉంటుందో అన్నదే ప్రజల ఆందోళన. ఈ యుద్ధ సంక్షోభాలు ఎప్పుడు సమసి పోతాయో, ఎప్పుడు తమకు ఈ ధరల పోటు నుంచి విముక్తి లభిస్తుందో తెలియని అయోమయం లో ప్రజలు వున్నారు. వుందిలే మంచి కాలం ముందుముందునా, అందరు సుఖపడాలి నందనందనా అన్నారు ఓ కవి. ఆ మంచి రోజులు ఎప్పుడు వస్తాయో... వేచి చూడాలి మరి.



**జీ. వెంకటరమణ.**
**సీనియర్ జర్నలిస్ట్.**




# ధరణి అక్రమాల డేటా బద్దలు

తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే కనీవినీ ఎరుగని అతిపెద్ద భూ కుంభకోణం ధరణి పోర్టల్ ముసుగులో ఎంత నిస్సిగ్గుగా జరిగిందో ఇప్పుడు అక్షరాలా పక్కా డేటాతో సహా బట్టబయలైంది. గత పాలకుల హయాంలో అత్యంత భద్రంగా దాచిపెట్టబడిన ధరణి చీకటి లావాదేవీల గుట్టును, అక్రమాల పునాదులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏమాత్రం వెనక్కి తగ్గకుండా అత్యంత ధైర్యంగా వెలికితీస్తోంది. సామాన్య రైతుల కన్నీళ్ల పునాదుల మీద, వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ, అసైన్డ్ భూములను అప్పనంగా బడాబాబులకు, రియల్ ఎస్టేట్ రాబందులకు కట్టబెట్టిన వ్యవహారంపై రాష్ట్ర కేబినెట్ తీసుకున్న ఫోరెన్సిక్ ఆడిట్ నిర్ణయం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. సాంకేతికతను అడ్డుపెట్టుకుని సాగించిన ఈ డిజిటల్ దోపిడీని, అదే టెక్నాలజీ ఆధారంగా పక్కాగా ఛేదించి, నేరస్తులను బోనెక్కించేందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సిద్ధం చేసిన ఈ అత్యుత్తమ వ్యూహం యావత్ తెలంగాణ సమాజానికి, లక్షలాది మంది రైతులకు ఒక కొత్త భరోసాను కల్పిస్తోంది. ధరణి పోర్టల్ ద్వారా జరిగిన వ్యవస్థీకృత భూదోపిడీకి ప్రధాన కేంద్రంగా రాజధాని హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న జిల్లాలు మారాయి. కేవలం రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోనే ఏకంగా లక్షకు పైగా ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు రాత్రికి రాత్రే ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి మారిపోయినట్లు ప్రభుత్వ తాజా డేటా స్పష్టం చేస్తోంది. రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా సుమారు నలభై ఐదు వేల రెండు వందల ఎకరాలు, మేడ్చల్ జిల్లాలో ముప్పై రెండు వేల ఐదు వందల ఎకరాలు, సంగారెడ్డి జిల్లాలో ఇరవై ఎనిమిది వేల నాలుగు వందల ఎకరాల భూమి నిషేధిత జాబితా (22 ఎ) నుంచి అక్రమంగా తొలగించబడింది. ఈ మూడు జిల్లాల్లో చేతులు మారిన భూముల విలువే ఓపెన్ మార్కెట్లో అక్షరాలా డెబ్బై ఎనిమిది వేల కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని ప్రాథమిక అంచనా. సామాన్యుడికి దక్కాల్సిన ఈ అమూల్యమైన ప్రభుత్వ సంపదను సర్వే నంబర్ల సబ్‌డివిజన్లను దాచిపెట్టే ముసుగులో కార్పొరేట్ శక్తులకు ధరణి ద్వారా ధారాదత్తం చేసిన తీరు వ్యవస్థలోని అంతులేని అవినీతికి పరాకాష్టగా నిలుస్తోంది.

**దక్షిణ తెలంగాణలో దయనీయ పరిస్థితులు**

హైదరాబాద్ శివార్లను దాటితే దక్షిణ తెలంగాణ జిల్లాలైన మహబూబ్ నగర్, నల్గొండలలో కూడా ధరణి సృష్టించిన డిజిటల్ విధ్వంసం అంతా ఇంతా కాదు. ఈ రెండు జిల్లాల పరిధిలో ముప్పై నాలుగు వేల ఎకరాలకు పైగా సీలింగ్ మరియు అసైన్డ్ భూములు అత్యంత సునాయాసంగా అన్యాక్రాంతమయ్యాయి. మహబూబ్ నగర్ జిల్లాలో పద్దెనిమిది వేల ఐదు వందల ఎకరాలు, నల్గొండ జిల్లాలో పదిహేను వేల ఆరు వందల ఎకరాల రికార్డులను పాత పహాణీలకు, గ్రామ నక్షాలకు పూర్తి భిన్నంగా మార్చేశారు. ఈ జిల్లాల నుంచి ప్రభుత్వానికి అందిన దాదాపు ముప్పై వేలకు పైగా అర్జీలు సామాన్య రైతులు పడుతున్న నరకయాతనకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. పాస్ బుక్ లో ఒక చిన్న అక్షరం తప్పు దొర్లితే సరిదిద్దుకునే ఆప్షన్ కూడా లేకుండా చేసిన గత పాలకులు, వందల ఎకరాల ప్రభుత్వ భూములను మాత్రం సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ల సీక్రెట్ లాగిన్ల ద్వారా ఇష్టానుసారంగా తమ బినామీలకు దోచిపెట్టారు. ముఖ్యమైన వ్యవసాయ ఆధారిత జిల్లాలైన ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ లలో సైతం ధరణి భూతానికి అమాయక రైతులు బలైపోయారు. ఒక్క ఖమ్మం జిల్లాలోనే పన్నెండు వేల మూడు వందల ఎకరాలు, నిజామాబాద్ జిల్లాలో తొమ్మిది వేల ఎనిమిది వందల ఎకరాలు, కరీంనగర్ లో ఎనిమిది వేల ఐదు వందల ఎకరాల భూముల రికార్డులు అనూహ్యంగా తారుమారయ్యాయి. ఖమ్మం లాంటి ప్రాంతంలో హైవే ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల సమీపంలో ఉన్న విలువైన భూములపై కన్నేసిన లోకల్ భూమాఫియా, ధరణి పోర్టల్ లోని లోపాలను తమకు అనుకూలంగా మార్చుకుని దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న అసలైన హక్కుదారులను రోడ్డున పడేసింది. ఈ జిల్లాల వ్యాప్తంగా గతంలో పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను సైతం ఎన్ఆర్ఐ మాడ్యూల్స్ ఉపయోగించి విదేశాల్లో ఉన్న ఉన్నతుల పేర్ల మీదకు ఆటోమేటిక్ గా బదలాయించినట్లు అద్భుతమైన డేటా విశ్లేషణలో బహిర్గతమవుతోంది.

**ఫోరెన్సిక్ ఆడిట్ తో డిజిటల్ దొంగల వేట**


గత ప్రభుత్వ పెద్దలు తెరవెనుక నడిపిన ఈ మహా కుంభకోణం వెనుక ఉన్న సాంకేతిక మాయాజాలాన్ని అణువణువూ బట్టబయలు చేసేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా 'ఫోరెన్సిక్ ఆడిట్' కు సాహసోపేతమైన ఆదేశాలు జారీ చేశారు. పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రతి ఒక్క లావాదేవీని, ప్రతి మ్యుటేషన్ ను ఈ ప్రత్యేక విచారణ బృందం (సిట్) డిజిటల్ గా ట్రాక్ చేయనుంది. ఏ రోజు, ఏ సమయానికి, ఏ రెవెన్యూ లేదా ఐటీ అధికారి ఐడీ ద్వారా సిస్టమ్ లోకి లాగిన్ అయ్యారు? డేటాబేస్ లోని ఆల్టరేషన్స్ ఏ ఐపీ అడ్రస్ ల నుంచి జరిగాయి? విదేశీ సర్వర్లలో పెట్టిన డేటాను మ్యానిపులేట్ చేసింది ఎవరు? అనే పక్కా సాంకేతిక ఆధారాలను ఈ ఆడిట్ వలవేసి బయటకు తీయబోతోంది. ధరణి సాఫ్ట్‌వేర్ ను డిజైన్ చేసిన ఏజెన్సీలు కావాలనే సృష్టించిన లూప్ హోల్స్ పై కూడా ఈ డిజిటల్ దర్యాప్తు లోతైన ఆపరేషన్ చేయనుంది.

రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా లక్షా 33 వేలకు పైగా రైతుల ఫిర్యాదులు రెవెన్యూ కార్యాలయాల్లో ఏళ్ల తరబడి పెండింగ్ లో మగ్గుతుండటమే ధరణి చారిత్రక వైఫల్యానికి అతిపెద్ద ఉదాహరణ. సుమారు 2 లక్షల ఎకరాలకు పైగా అన్యాక్రాంతమైన విలువైన భూములను తిరిగి ప్రభుత్వ పరం చేయడంతో పాటు, అసలైన హక్కుదారులైన రైతులకు తిరిగి న్యాయం చేసేందుకు ఈ ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక అత్యంత కీలకంగా మారనుంది. ప్రభుత్వ ఆదేశాలు లేకుండానే నిషేధిత జాబితా నుంచి అన్ లాక్ అయిన ప్రతి గుంట భూమి జాతకాన్ని ప్రభుత్వం ఇప్పుడు మైక్రోస్కోప్ పెట్టి వెతుకుతోంది. రాష్ట్ర ప్రజల ఆస్తుల డేటా భద్రతలో అత్యంత ప్రమాదకరమైన లోపాలు ఉన్నాయని, ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో రాష్ట్ర భూ రికార్డుల సర్వర్ల కంట్రోల్ ఉండటం ఎంత దారుణమో ఈ చారిత్రాత్మక దర్యాప్తు ద్వారా యావత్ దేశానికి వెల్లడి కానుంది. సాంకేతికత ముసుగులో కళ్లుగప్పి జరిగిన ఈ వ్యవస్థీకృత భూదోపిడీని శాశ్వతంగా నిలువరించడంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రదర్శిస్తున్న ఉక్కు సంకల్పం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ ప్రత్యేక బృందం అందించే ఫైనల్ ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగా, అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి రాజకీయ పెద్దలైనా, కీలక అధికారులైనా సరే వదిలిపెట్టకుండా వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైంది. ధరణి పోర్టల్ లోని అస్తవ్యస్తమైన, రైతు వ్యతిరేక విధానాలను సమూలంగా ప్రక్షాళన చేసి, రెవెన్యూ చట్టంలో అన్నదాతలకు అండగా నిలిచే గొప్ప మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. భూమాఫియా గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న ఈ సంచలన నిర్ణయంతో, తెలంగాణలో అవినీతి రహిత, పారదర్శక రెవెన్యూ పాలనకు సరికొత్త పునాది పడుతోందని సామాన్య ప్రజలు, రైతాంగం ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు.

**- (గడల నరసింహారావు, సీనియర్ జర్నలిస్ట్, )**

# మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై సీఈసీ కీలక వ్యాఖ్యలు

**సుప్రీంకోర్టు తీర్పుతో ఎన్నికల సంఘం వైఖరికి బలం.**



హైదరాబాద్, మహా : మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రాజ్యసభకు పోటీ చేసిన మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వివాదంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తొలిసారి విస్తృతంగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియలో చట్టం ముందు అందరూ సమానమేనని, అభ్యర్థి ఎవరు అన్నది కాకుండా ఎన్నికల నిబంధనలే అత్యున్నతమని ఆయన స్పష్టం చేశారు. నామినేషన్ దాఖలు చేసే ప్రతి అభ్యర్థి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఫారం26 అఫిడవిట్ లో కోరిన ప్రతి సమాచారాన్ని సంపూర్ణంగా, నిజాయితీగా వెల్లడించడం చట్టబద్ధమైన బాధ్యత అని పేర్కొన్నారు. ఎలాంటి సమాచారం దాచిపెట్టినా లేదా అసంపూర్ణ వివరాలు సమర్పించినా, రిటర్నింగ్ ఆఫీసర్ చట్ట ప్రకారం నిర్ణయం తీసుకునే పూర్తి అధికారం కలిగి ఉంటుందని ఆయన తెలిపారు.

జ్ఞానేష్ కుమార్ వివరాల ప్రకారం, మీనాక్షి నటరాజన్ సమర్పించిన నామినేషన్ పత్రాలను పరిశీలించిన సందర్భంగా ఫారం26 అఫిడవిట్ లో తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుకు సంబంధించిన వివరాలు పూర్తిగా వెల్లడించలేదని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపై రిటర్నింగ్ ఆఫీసర్ ఆమెకు వివరణ ఇచ్చే అవకాశంతో పాటు అవసరమైన వివరాలు సమర్పించుకునేందుకు సమయం కూడా కల్పించినప్పటికీ, ఆ అవకాశాన్ని ఆమె వినియోగించుకోలేదని చెప్పారు. అందువల్ల రిటర్నింగ్ ఆఫీసర్ తీసుకున్న నిర్ణయం పూర్తిగా ఎన్నికల చట్టాల పరిధిలోనే జరిగిందని, అందులో ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకునే అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

ఈ వివాదంలో అత్యంత కీలక అంశం ఎన్నికల కమిషన్ అధికారాలపై జ్ఞానేష్ కుమార్ చేసిన వ్యాఖ్యలే. నామినేషన్ పత్రాలను పరిశీలించడం, ఆమోదించడం లేదా తిరస్కరించడం పూర్తిగా సంబంధిత రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఎన్నికల చట్టం కల్పించిన స్వతంత్ర అధికారమని ఆయన వివరించారు. రిటర్నింగ్ ఆఫీసర్ తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని ఎన్నికల కమిషన్ సమీక్షించడం లేదా మార్చడం సాధ్యం కాదని, అలా చేస్తే ఎన్నికల ప్రక్రియ స్వతంత్రత దెబ్బతింటుందని పేర్కొన్నారు. అందుకే రిటర్నింగ్ ఆఫీసర్ నిర్ణయాల్లో ఎన్నికల సంఘం నేరుగా జోక్యం చేసుకోదని ఆయన స్పష్టం చేశారు.

ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నాయకత్వం ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించి నామినేషన్ తిరస్కరణను ఉపసంహరించుకోవాలని కోరినా, కమిషన్ చట్టపరమైన పరిమితులను వివరించింది. అనంతరం మీనాక్షి నటరాజన్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తూ తన నామినేషన్ తిరస్కరణను రద్దు చేయాలని కోరారు. అయితే సుప్రీంకోర్టు ఆమె వాదనలను అంగీకరించలేదు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత రాజ్యాంగంలోని ఆర్టికల్ 329(బి) ప్రకారం కోర్టులు సాధారణంగా ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేవని, 1952లో ఇచ్చిన ఎన్.పీ. పొన్నుస్వామి వర్సెస్ రిటర్నింగ్ ఆఫీసర్ తీర్పు ఇప్పటికీ అమల్లో ఉన్న న్యాయసూత్రమేనని ధర్మాసనం స్పష్టం చేసింది.

సుప్రీంకోర్టు మరో కీలక అంశాన్ని కూడా స్పష్టం చేసింది. ప్రస్తుతం రిట్ పిటిషన్‌ను విచారించడం సాధ్యం కాదని పేర్కొంటూనే, ఎన్నికలు పూర్తైన తర్వాత చట్టప్రకారం ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేసుకునే హక్కు మీనాక్షి నటరాజన్‌కు ఉంటుందని తెలిపింది. అలాగే ఈ ఉత్తర్వులో చేసిన వ్యాఖ్యలు భవిష్యత్తులో దాఖలయ్యే ఎలక్షన్ పిటిషన్ విచారణపై ఎలాంటి ప్రభావం చూపబోవని కూడా ధర్మాసనం స్పష్టం చేసింది.

ఈ వివాదానికి కేంద్రబిందువైన అంశం తెలంగాణలో నమోదైన ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించిన కేసు. బీజేపీ అభ్యంతరం మేరకు రిటర్నింగ్ ఆఫీసర్ పరిశీలన జరిపి, కోర్టు కాగ్నిజెన్స్ తీసుకున్న కేసుకు సంబంధించిన వివరాలు ఫారం26లో పూర్తిగా వెల్లడించలేదని నిర్ధారించారు. కాంగ్రెస్ మాత్రం అది కేవలం ప్రైవేట్ కంప్లైంట్ మాత్రమేనని, వెల్లడించాల్సిన అవసరం లేదని వాదించింది. అయితే రిటర్నింగ్ ఆఫీసర్ ఆ వాదనను అంగీకరించలేదు. అనంతరం సుప్రీంకోర్టు కూడా ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించడంతో, నామినేషన్ తిరస్కరణ నిర్ణయం యథాతథంగా కొనసాగింది.

సీఈసీ జ్ఞానేష్ కుమార్ తాజా వ్యాఖ్యలతో ఒక విషయం స్పష్టమైంది. ఎన్నికల నిబంధనలు ప్రతి అభ్యర్థికి సమానంగా వర్తిస్తాయని, నామినేషన్ పత్రాల్లో పూర్తి సమాచారాన్ని వెల్లడించడం అభ్యర్థుల చట్టబద్ధ బాధ్యత అని, రిటర్నింగ్ ఆఫీసర్ నిర్ణయాలు స్వతంత్రంగా ఉంటాయని, వాటిలో ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోదని ఆయన తేల్చిచెప్పారు. అదే సమయంలో సుప్రీంకోర్టు తీర్పు కూడా ఎన్నికల ప్రక్రియలో న్యాయస్థానాల జోక్యానికి రాజ్యాంగపరమైన పరిమితులు ఉన్నాయని మరోసారి స్పష్టం చేయడం ద్వారా ఎన్నికల చట్టాల అమలుకు బలమైన సందేశం ఇచ్చింది.

# పట్టణ పేదల సొంతింటి కలకు సర్కార్ ఊతం

**'ఇందిరమ్మ పట్టణ గృహ నిర్మాణ' పథకానికి గ్రీన్‌సిగ్నల్.**

**హైదరాబాద్, మహా:** పట్టణ ప్రాంతాల్లోని పేదలు, అల్పాదాయ వర్గాల సొంతింటి కలను సాకారం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. 'ఇందిరమ్మ పట్టణ గృహ నిర్మాణ పథకం' అమలుకు సంబంధించి ప్రత్యేక నిబంధనలను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు , అల్పాదాయ వర్గాలు కోసం సరసమైన ధరల్లో నాణ్యమైన 2 బిహెచ్కె ఇళ్ల నిర్మాణానికి ఈ మార్గదర్శకాలు దోహదపడనున్నాయి. తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఈ గృహ నిర్మాణ ప్రాజెక్టులను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పట్టణ ప్రాంతాల్లో అందుబాటు ధరల్లో గృహాలను వేగంగా నిర్మించి లబ్ధిదారులకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలనా ప్రక్రియలను మరింత సరళీకరించింది. గృహ నిర్మాణాలకు సంబంధించిన అనుమతుల్లో జాప్యం లేకుండా ప్రత్యేక టీజీహెచ్‌బీ అఫోర్డబుల్ అర్బన్ హౌసింగ్ సింగిల్ విండో కమిటీని ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కమిటీ ద్వారా వివిధ శాఖల నుంచి అవసరమైన అనుమతులను ఒకే వేదికపై త్వరితగతిన మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా ఉండేందుకు 'బిల్డ్‌నౌ వర్క్‌ఫ్లో విధానాన్ని కూడా అమల్లోకి తీసుకురానుంది. ఈ విధానం ద్వారా దరఖాస్తుల పరిశీలన, సాంకేతిక అనుమతులు, నిర్మాణ అనుమతుల జారీ వంటి ప్రక్రియలు డిజిటల్ విధానంలో వేగంగా పూర్తికానున్నాయి. దీంతో గృహ నిర్మాణ ప్రాజెక్టులు నిర్దేశిత గడువులో పూర్తయ్యే అవకాశాలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు.

ఈ పథకంలో భాగంగా నిర్మించే ఇళ్లకు ప్రభుత్వం మరో కీలక రాయితీ ప్రకటించింది. ప్లానింగ్ అనుమతులు, బిల్డింగ్ పర్మిషన్ ఫీజులను పూర్తిగా మాఫీ చేసింది. ఇందిరమ్మ పట్టణ గృహ నిర్మాణ పథకం కింద చేపట్టే ప్రాజెక్టులకు ఎలాంటి ప్లానింగ్ లేదా బిల్డింగ్ పర్మిషన్ చార్జీలు వసూలు చేయవద్దని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ హౌసింగ్ బోర్డు చేసిన ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ ఈ మినహాయింపును అమలు చేసింది.

అనుమతుల ప్రక్రియను సరళీకరించడం, ఫీజులను మాఫీ చేయడం, సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా నిర్మాణ వ్యయాన్ని తగ్గించి, తక్కువ ధరల్లో నాణ్యమైన ఇళ్లను పట్టణ పేదలకు అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. దీంతో గృహ నిర్మాణ పనులు వేగవంతం కావడంతో పాటు లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులో జాప్యం కూడా తగ్గే అవకాశం ఉంది.

పట్టణ ప్రాంతాల్లో సొంత ఇల్లు లేని వేలాది నిరుపేద, అల్పాదాయ కుటుంబాలకు ఈ పథకం ద్వారా ఊరట లభించనుంది. నాణ్యమైన గృహాలు, పారదర్శక అనుమతుల వ్యవస్థ, వేగవంతమైన నిర్మాణ ప్రక్రియతో ఇందిరమ్మ పట్టణ గృహ నిర్మాణ పథకం తెలంగాణలో పట్టణ గృహ రంగంలో కీలక మార్పులకు దారి తీసే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



# చర్లపల్లి హిందూ స్మశాన వాటికలో ఇతర మతాలకు స్థలం కేటాయింపు

- **ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి: ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్**

**కుషాయిగూడ, మహా :** చర్లపల్లి హిందూ స్మశాన వాటికలో ముస్లింలు, క్రైస్తవులకు స్థలం కేటాయించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ శుక్రవారం ఆందోళన చేపట్టారు. హిందూ స్మశాన వాటికను సందర్శించిన ఆయన స్థానిక హిందూ కుల సంఘాల నాయకులు, ప్రజలతో కలిసి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్వీఎస్ఎస్ మాట్లాడుతూ, చర్లపల్లి హిందూ స్మశాన వాటిక యుగయుగాలుగా, తరతరాలుగా హిందువుల అంత్యక్రియల కోసం వినియోగంలో ఉంది. రెవెన్యూ రికార్డుల్లో కూడా ఇది హిందూ స్మశాన వాటికగానే నమోదైంది. అలాంటి స్థలాన్ని ఇతర మతాలకు కేటాయిస్తామని చెప్పడం హిందూ సమాజ మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే చర్య అని విమర్శించారు. మత విశ్వాసాలు, సంప్రదాయాలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. హిందూ స్మశాన వాటికను పూర్తిగా హిందువులకే కొనసాగిస్తూ, ఎలాంటి మార్పులు చేయకుండా యథాతథంగా పరిరక్షించాలి అని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని, హిందూ స్మశాన వాటికలో ఇతర మతాలకు స్థలం కేటాయించే ప్రతిపాదనలను విరమించుకోవాలని ఆయన కోరారు. అవసరమైతే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నర్సింగరావు, విద్యాసాగర్, నాదం లక్ష్మణ్ గౌడ్, వెంకులు, కుల సంఘాల నాయకులు రాజు, రాము, వినయ్, సాగర్, బాబు, తైదల మల్లేష్, కృష్ణ, రాజేష్, విట్టల్, లోకనాథ్, ఈగ భిక్షపతి, గిరిబాబు, సాయిచరణ్, రాంబాబు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. స్వచ్ఛందంగా చర్లపల్లిలో కుల సంఘాలు హిందూ సంఘాలు కదిలి వచ్చాయి.

# మంథని సిగలో మరో మణిహారం..

- **శ్రీధర్ బాబు కృషికి ఫలితం**
- **మంత్రి పట్టుదలతో మంథనికి న్యాక్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్**
- **భవన నిర్మాణానికి రూ.20 కోట్ల మంజూరు..**
- **ఉత్తర తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణకు కొత్త దిక్సూచి**



**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**కరీంనగర్ మహా :** మంథని అభివృద్ధి పథంలో మరో కీలక అడుగు పడింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిరంతర కృషి, పట్టుదల ఫలితంగా ప్రతిష్ఠాత్మక నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (న్యాక్) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే కాకుండా, భవన నిర్మాణానికి రూ.20 కోట్లను మంజూరు చేసింది. మంథనిని విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కేంద్రంగా తీర్చిదిద్దాలన్న మంత్రి శ్రీధర్ బాబు సంకల్పానికి ఇది మరో మైలురాయిగా నిలిచింది.రవాణా, రోడ్లు-భవనాల (టీఆర్&బీ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో మంథనిలో అత్యాధునిక సౌకర్యాలతో న్యాక్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనాన్ని నిర్మించనున్నారు.నిర్మాణ రంగంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలను అందించేలా ఈ కేంద్రాన్ని రూపొందించనున్నారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సుల ద్వారా శిక్షణ పొందిన యువతకు స్వయం ఉపాధితో పాటు దేశీయ, అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభించేలా శిక్షణ అందించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కేంద్రం మంథనికి రావడంపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా-రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఉత్తర తెలంగాణ యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించి, ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలకు వారధిగా ఈ న్యాక్ సెంటర్ నిలుస్తుందని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. మంథనిని విద్య, ఉపాధి, పరిశ్రమలకు అనుసంధానించే కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రాంత అభివృద్ధిలో మరో చారిత్రక ఘట్టంగా నిలవనుందని పేర్కొన్నారు.



# బెల్లంపల్లిలో లైబ్రరీయన్ గోపికి ఘన సత్కారం

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి కాళోజీ శాఖ గ్రంథాలయ లైబ్రరీన్ ఉప్పు గోపి సేవలు మరువలేనివని పోటీ పరీక్షలు అభ్యర్థులు పేర్కొన్నారు. బదిలీపై చెన్నూర్ గ్రంథాలయానికి వెళ్తున్న గ్రంథాలయ అధికారి ఉప్పు గోపిని పోటీ పరీక్షల అభ్యర్థులు గ్రంథాలయం ఆవరణలో నిర్వహించిన అభినందన సభలో మాట్లాడారు. లైబ్రేరియన్ గోపి ని శాలువాతో ఘనంగా సత్కరించి, మెమొంటోను బహుకరించారు. రూ. 75 లక్షల నూతన గ్రంథాలయ భవనం, నూతన బోరు గోపి హయాం లోనే పూర్తి అయ్యాయని వెల్లడించారు. అభ్యర్థులతో స్నేహపూర్వకంగా ఉండి ప్రతి ఒక్క పుస్తకాన్ని తమకు అందుబాటులో ఉంచేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పోటీ పరీక్షల అభ్యర్థులు బండి ప్రవీణ్ కుమార్, ఇప్ప రాజేంద్రప్రసాద్, తాటిపాముల నరేష్, దామెర విజయ్, దాసరి అలేఖ్య, అటెండర్ ఇరుగురాల శ్రీనివాస్, స్వీపర్ నీలి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



# స్వామి నాయక్ ప్రతిభకు ఆశ్చర్యపడ్డ బీర్ల ఐలయ్య

**యాదాద్రి భువనగిరి జూలై 17 మహా :** జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధరావత్ తండాకు చెందిన శారీరక వికలాంగుడు స్వామి నాయక్ అసాధారణ ప్రతిభను యాదగిరిగుట్ట మండలం లప్ప నాయక్ తండలో శుక్రవారం చూసి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆశ్చర్యపడ్డారు చేతులు లేకపోయినా, కాళ్ల వేళ్ల సహాయంతో మొబైల్ ఫోన్‌ను చాకచక్యంగా ఆపరేట్ చేయడంతో పాటు, అదే కాళ్ల వేళ్లతో తెల్ల కాగితంపై "తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీ బీర్ల ఐలయ్య గారికి ధన్యవాదాలు" అని రాయడం అక్కడ ఉన్న వారందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. స్వామి నాయక్ ప్రతిభను అభినందించిన బీర్ల ఐలయ్య జనగామ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఆయనకు అవసరమైన ప్రభుత్వ సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవడంతో



పాటు, ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశం కల్పించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామి నాయక్‌ను శాలువాతో సన్మానించి, ఆయన ఆత్మవిశ్వాసం, పట్టుదలను బీర్ల ఐలయ్య గారు ప్రశంసించారు.



# వర్షపాత లోటు.. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన

**పాలకుర్తి, జూలై 17 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం మరియు వర్షపాత లోటు నేపథ్యంలో మండలంలోని రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామ మరియు క్షేత్ర స్థాయిలో ఏ.ఈ.ఓ లు పర్యటిస్తూ ఎల్‌నినో పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి, ఆరుతడి పంటల ప్రాధాన్యత ఏంటి అనే విషయాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.ఈ సందర్భంగా పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి ఏవో బండి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ. గత వానాకాలంతో పోలిస్తే ఈ ఏడాది సుమారు 30 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని,దీనివల్ల భూగర్భ జలమట్టాలు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత సీజన్‌లో మండలంలో సుమారు 2,782 ఎకరాలలో పత్తి సాగు జరుగుతోందని, తెలిపారు.



# ప్రభుత్వం భూమి ఆక్రమణకు గురి.!

- **గ్రామస్తుల ఆందోళన రోడ్డుపై బైఠాయింపు**
- **ఆ భూమిని ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలి**
- **భూ అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి**
- **దండుమైలారం గ్రామ సర్పంచ్ ఈదులకంటి నరేష్ గౌడ్**

**ఇబ్రహీంపట్నం జులై 17 మహా:** దండుమైలారం గ్రామంలో ప్రభుత్వ భూమి వివాదం తీవ్ర ఆందోళనలకు దారితీసింది. ఇబ్రహీంపట్నం మండలం, దండుమైలారం గ్రామ సర్పంచ్ ఈదులకంటి నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తుల ఆరోపణల ప్రకారం, జనార్ధన్ రెడ్డి అనే వ్యక్తికి 194 గజాల వ్యక్తిగత భూమి మాత్రమే ఉండగా, అప్పట్లో గ్రామ కార్యదర్శిగా పనిచేసిన తన బంధువు సహకారంతో తన పలుకుబడిని ఉపయోగించి సుమారు నాలుగు ఎకరాలకు పైగా సర్కార్ భూమిని ఆక్రమించి, ప్రహరీ గోడ నిర్మించుకున్నారని వారు ఆరోపించారు. ఆక్రమిత భూమిని వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని గ్రామ పంచాయతీకి అప్పగించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. గ్రామంలో సొంత ఇంటి స్థలం లేని నిరుపేద కుటుంబాలకు, అదే భూమిలో ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేయాలని సర్పంచ్‌తో పాటు గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. సర్కార్ భూములను కాపాడుతూ ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# పాలకుర్తిలో డ్రై డే – ఫ్రైడే దోమల నివారణపై ముమ్మర అవగాహన

**పాలకుర్తి, జూలై 17 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పాలకుర్తి గ్రామంలో శుక్రవారం నాడు 'డ్రై డే - ఫ్రైడే' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి ప్రమాదకరమైన సీజనల్ వ్యాధులను అరికట్టడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల మాట్లాడుతూ. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ఇండ్ల చుట్టుపక్కల ఉన్న మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పాత టైర్స్‌లు, కుండీలు, టైర్లలో నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు.పరిశుభ్రమైన గ్రామం ఆరోగ్యకరమైన జీవితం అనే నినాదంతో మన గ్రామాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు .ఈ కార్యక్రమంలో స్థానిక బీసీ మేడమ్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ప్రతి ఇంటికి తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.



# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

**అదనపు కలెక్టర్ భాస్కరరావు**

**యాదాద్రి భువనగిరి జూలై 17 మహా**
ప్రతి శుక్రవారం డ్రై డేఫ్రైడే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.తుర్కపల్లి మండలంలోని మల్కాపురం గ్రామంలో నిర్వహించిన శుక్రవారం డ్రై డేఫ్రైడే కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామ ప్రజలు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.డ్రై డే కార్యక్రమంలో భాగంగా నీరు నిల్వ ఉండే ప్రదేశాలు, ఇతర పాత వస్తువులు, ఇతర వ్యర్థాలను తొలగించి దోమల వ్యాప్తిని అరికట్టాలని తెలిపారు. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను నివారించడంలో ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, మురుగు నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో, అంగన్వాడిలో పరిసరాలు పరిశుభ్రంగా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ప్రతి ఇంటి వద్ద పరిశుభ్రత పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన డిమాండ్లను వెంటనే అమలు చేయాలి

**ఎర్ర జాన్సన్ తెలంగాణ ఉద్యమకారుడు**



**యాదాద్రి భువనగిరి / హైదరాబాద్ జూలై 17 మహా:** అధ్యక్షులు & సభ్యులు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు & సంక్షేమ కమిటీకి తెలంగాణ ఉద్యమ జ్యోతిలో శుక్రవారం ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నాయకుడు, సీనియర్ జర్నలిస్టు ఎర్ర జాన్సన్ సూచనలు చేశారు ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు & అమరుల కుటుంబాలకు గౌరవ పెన్షన్, ఉద్యోగాలు మరియు ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయవలసిందిగా కోరారు ప్రత్యేక తెలంగాణ సాధన కోసం 1969 నుండి 2014 వరకు తొలి దశ,మలిదశలో జరిగిన ఉద్యమంలో వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు కవులు, కళాకారులు, జర్నలిస్టులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పాల్గొన్నారు. ఈ ఉద్యమంలో సుమారు1200 మందికి పైగా అమరులు అయ్యారు. వేల మంది జైలుకు వెళ్లారు, కేసులు ఎదుర్కొన్నారు, ఉద్యోగాలు కోల్పోయారు. జీవితాలను త్యాగం చేశారు... తెలంగాణ ఏర్పడి 12 సంవత్సరాలు అయినా, ఝార్ఖండ్ లాంటి రాష్ట్రాలు ఉద్యమకారులకు పెన్షన్, ఉద్యోగాలు ఇస్తున్నా, మన రాష్ట్రంలో ఇంకా ఉద్యమకారులను గుర్తించలేదు సమగ్రమైన పథకం అమలు చేయలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం ఉద్యమకారుల మద్దతు కోరుతూ ఉద్యమకారుల డిమాండ్లను మేనిఫెస్టోలో పెట్టడం జరిగింది అధికారంలోకొచ్చి రెండున్నర ఏళ్లయినా ఉద్యమకారులు డిమాండ్లను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించడం తగదు గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఉద్యమకారులను గుర్తించక పోవడం, విస్మరించడంతోనే అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చిందని గమనించాలి కావున కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను అమలు చేసేందుకు గౌరవ కె కేశవరావు చైర్మన్ గా కమిటీని వేయడాన్ని స్వాగతిస్తున్నాం, అభినందిస్తున్నాం వర్షం వ్యక్తం చేస్తున్నాం అలాగే కేకే కమిటీలో మహిళకు స్థానం లేకపోవడం విచారకరం విడ్డూరం తెలంగాణ ఉద్యమంతో సంబంధం ఉన్న మహిళకు కేక కమిటీల స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.. జాప్యం లేకుండా ఉద్యమకారుల డిమాండ్లను పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలేరు ప్రాంత తెలంగాణ ఉద్యమకారులు జంపాల శ్రీనివాస్, తమ్ముడి పద్మారావు మురిగాడు అశోక్, రచ్చ రామ్ నరసయ్య, పుట్టల కిష్టయ్య, రామ్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మా త్యాగాలతోనే సాధ్యమైంది. మాకు అధికారం వద్దు, మా త్యాగానికి గౌరవం కావాలని కేకే కమిటీకి ఆయన విజ్ఞప్తి చేస్తూ పలు సూచనలు, అభిప్రాయాలు సలహాలతో వినతిపత్రాన్ని అందించారు.

# గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**యాదాద్రి భువనగిరి జూలై 17 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మర్రిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు..ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పంచాయతీ భవనాన్ని పరిశీలించిన ఆయన, గ్రామాభివృద్ధికి గ్రామ పంచాయతీలు కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పంచాయతీ కార్యాలయాలు



సమర్థవంతంగా పనిచేయాలని, గ్రామాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉందని అన్నారు.అనంతరం గ్రామ సర్పంచ్‌ను పంచాయతీ కార్యాలయంలోని సర్పంచ్ కుర్చీలో స్వయంగా కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా గ్రామాభివృద్ధికి అంకితభావంతో పని చేయాలని సూచించారు.ఈ సందర్భంగా సర్పంచ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# ముందు వరుసలో లైన్స్ క్లబ్ సేవలు

**మందమర్రి ప్రెస్ క్లబ్ కు సిమెంట్ బెంచ్ లు అందజేత**

**మందమర్రి, మహా :** మందమర్రి పట్టణంలో ముందు వరుసలో లైన్స్ క్లబ్ సేవలు ఉన్నాయని లయన్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సొత్తుకు సుదర్శన్, మందమర్రి క్లబ్ పట్టణ అధ్యక్షులు పెండ్యాల గౌతం చారిలు కొనియాడారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ 180/2020 లో మూడు సిమెంట్ బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 210 దేశాలలో ఉన్న ఏకైక స్వచ్ఛంద సంస్థ లైన్స్ క్లబ్ అని అన్నారు. ఈ సంస్థ ఏకైక ముఖ్య ఉద్దేశం సేవా కార్యక్రమాలు నిర్వహించడమే నని చెప్పారు. మందమర్రి రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ప్రయాణికులకు సౌకర్యార్థం సిమెంట్ బెంచీలు సమకూర్చామని వెల్లడించారు. అంతేకాకుండా నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు, అన్నదాన కార్యక్రమాలు, షుగర్, బీపీ వంటి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఒక వ్యక్తి అకస్మాత్తుగా మరణిస్తే ఆ మరణించిన వ్యక్తి కండ్లను దానం చేయాలని వారు పిలుపునిచ్చారు. తద్వారా కంటి చూపు లేనటువంటి వ్యక్తులకు కంటి చూపు ఇచ్చినవారు అవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ లయన్ జాకీర్, కోశాధికారి లయన్ బుర్ర ఆంజనేయులు, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ లయన్ తౌటం శ్రీను, డైరెక్టర్ లయన్ బింగి రాజన్న, డైరెక్టర్ లయన్ కొక్కుల మధు, లయన్ తాడి కొండ లూథర్ , లయన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లిలో అక్రమ స్క్రాప్ దుకాణం తొలగింపు

**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి మున్సిపాలిటీ కాంటా ఏరియా మహమ్మద్ ఖాసీం బస్తీలో నిర్వహిస్తున్న అక్రమ స్క్రాప్ దుకాణంను ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలకు తీవ్ర అసౌకర్యాలు, రవాణా రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని,అలాగే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజారోగ్యానికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు మున్సిపాలిటీ తక్షణ చర్యలు చేపట్టిందన్నారు.పట్టణంలో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న మిగిలిన మూడు అక్రమ స్క్రాప్ దుకాణాలను కూడా త్వరలో తొలగిస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ నేపథ్యంలో స్థానిక నివాసితులు మున్సిపాలిటీకి పలుమార్లు ఫిర్యాదులు, దరఖాస్తులు సమర్పించగా, సంబంధిత స్క్రాప్ దుకాణ యజమానికి మున్సిపాలిటీ నోటీసులు జారీ చేసింది. నోటీసులకు అనుగుణంగా మున్సిపాలిటీ అధికారులు మహమ్మద్ ఖాసీం బస్తీలో ఉన్న అక్రమ స్క్రాప్ దుకాణాన్ని తొలగించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏ.ఈ. నిఖిల్, ఆర్వో భుజంగరావు ,వన్ టౌన్ ఎస్‌హెచ్ఓ శ్రీనివాస్ , ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి. సునీల్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది మరియు ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



# లప్ప నాయక్ తండా వాసుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- **ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మార్నింగ్ వాక్**

**యాదాద్రి భువనగిరి జూలై 17 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని లప్ప నాయక్ తండా, రాళ్ల జనగాం గ్రామాల్లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్ చేశారు గ్రామ ప్రజలతో కలిసి నడుస్తూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.మార్నింగ్ వాక్ అనంతరం తాండ వాసుల తో కలసి సంప్రదాయ ఆహారం జొన్న రొట్టె సోలాయ్ తో సామూహికంగా అల్పాహారం చేశారు. ముందుగా బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం వల్ల భూ నిర్వాసితులుగా మారిన లప్ప నాయక్ తండా వాసులకు దాతర్‌పల్లి సమీపంలో కేటాయించిన పునరావాస స్థలాన్ని ప్రభుత్వ విప్ పరిశీలించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తండా ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థతో పాటు ఇతర మౌలిక వసతులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భూ నిర్వాసితులకు అన్ని సౌకర్యాలతో కూడిన నివాస ప్రాంతాన్ని ఏర్పాటు చేయడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఆయన, ఈ నెలలోనే ప్లాట్లను తండా వాసులకు అందజేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గత ప్రభుత్వం వారిని నీళ్లలో ముంచగ ఈ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇస్తూ అవసరమైన అన్ని పనులను వేగంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రాళ్ల జనగాం, లప్ప నాయక్ తండా గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ వాటర్ ప్లాంట్ ద్వారా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణలో స్వచ్ఛమైన తాగునీరు కీలకమని, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా లప్ప నాయక్ తండా వాసులు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు ఘన స్వాగతం పలికి, గ్రామ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు వారు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# అధైర్య పడకండి అండగా ఉంటా

**డిసిసి అధ్యక్షులు కుడా చైర్మన్ ఇనగాల**

హనుమకొండ మహా;హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ కాంగ్రెస్ పార్టీ సర్పంచి పోలేపాక శ్రీనివాస్ అనారోగ్యానికి గురై, హనుమకొండ కాకాజీ కాలనీ లోని శ్రీ లాస్య హాస్పిటల్' లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి శుక్రవారం హాస్పిటల్ కు వెళ్లి శ్రీనివాస్ ను పరామర్శించి అధైర్య పడకండి అండగా ఉన్నానని ధైర్యం చెప్పి ఆయన ఆరోగ్య



పరిస్థితి పై వైద్యులను అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

# కూరగాయల సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలి

**యాదాద్రి భువనగిరి జూలై 17 మహా :** రైతులెవరు వరి వేయకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు దిష్టి సాధించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారుశుక్రవారం కలెక్టరేట్ మిని మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలిసి మండల స్పెషల్ అధికారులతో, మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులతో ఎల్ ని నో ఎఫెక్ట్ వలన జిల్లాలో వరి సాగు కు ప్రత్యామ్నాయ పంటలపై సమీక్షించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం-2026లో ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అయిన నేపథ్యంలో వ్యవసాయ సాగులో ప్రయోజనకర పద్ధతులను, పంట మార్పిడి విధానాలను రైతులకు వివరించి లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాల్లో సాగవుతున్న పంటలపై మండలాల వారీగా రివ్యూ నిర్వహించారు.జిల్లాలో 50 శాతం వరకు వేరే పంటలు సాగు అయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.జిల్లాలో మూసి పరివాహక ప్రాంతం ఎక్కువగా ఉండి అక్కడ వరి పంట కాకుండా వేరే పంటలు వేసే విధముగా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.హైద్రాబాద్ కి సరిహద్దు లో ఉన్న మండలాలు మార్కెటింగ్ అవకాశాలు ఉన్నాయి కాబట్టి కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు,తదితర పంటలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో ఆయిల్ ఫామ్ పంటలు 5 వేల ఎకరాలకు టార్గెట్ పెట్టాలని సంబంధిత అధికారులు సూచించారు. ఏ ఈ ఓ లు అందరు రైతు వేదికల్లో రైతులకు ఎల్ నినో ఎఫెక్ట్ పై అవగాహన కలిపించాలి, డ్రిప్ ఇరిగేషన్ పంటలు వేసేలా చూడాలి. వానాకాలం సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని అవి రైతులకు అందజేయాలన్నారు. రైతులకు జిల్లాల వారీగా విత్తనాల నిల్వలు, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతులు వరి వేయకుండా కూరగాయలు, పండ్ల పంటలు, రెడ్ గ్రామ్, ఆయిల్ ఫామ్స్ తదితర



పంటలను రైతులు సాగు చేసుకునేలా మండల వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన లాభదాయకం పంటలు సాగు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.మార్చి నెల నుంచి ఇప్పటి వరకు జిల్లాలో తక్కువ వర్షపాతం మాత్రమే నమోదైనందున, భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు తమ బోరు బావుల్లో అందుబాటులో ఉన్న నీటి సామర్థ్యాన్ని అంచనా వేసుకుని,అధిక నీరు అవసరమయ్యే పంటల విస్తీర్ణాన్ని తగ్గించి,కొద్ది రోజుల్లోనే కోతకు వచ్చే స్వల్పకాలిక కూరగాయల పంటలను సాగు చేయడం ఉత్తమమని సూచించారు..రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేసి రైతులు విత్తనాలు సద్వినియోగం చేసుకొని అదనపు ఆదాయం పొందే విధంగా కూరగాయల సాగును చేపట్టాలని కోరారు. రుతుపవనాలు ఆలస్యంగా ప్రారంభమయ్యే పరిస్థితుల్లో టమాటా, వంకాయ,మిరప,బెండ,మునగ,చిక్కుడు, గోరుచిక్కుడు,పాలకూర, సొరకాయ, కాకరకాయ,బీరకాయ,దోసకాయ వంటి పంటలకు అనువైన స్వల్పకాలిక, కరువును తట్టుకునే రకాలను సాగు చేయాలని తెలిపారు. ముఖ్యంగా టమాటా, వంకాయ పంటల్లో అంటుకట్టిన నారుమొక్కలను వినియోగించడం,విడతల వారీగా నర్సరీలను ఏర్పాటు చేయడం ద్వారా తేమ ఒత్తిడిని తగ్గించి మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు. అలాగే గట్లు-కాలువల పద్ధతి, ఎత్తైన మడులపై సాగు,బిందు సేద్యం,మైక్రో స్ప్రింక్లర్ విధానాలను అవలంబించడం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. శాస్త్రీయ సూచనల మేరకు వినియోగించడం ద్వారా పంటల దిగుబడి, నాణ్యత మెరుగుపడుతుందని వివరించారు.వాతావరణ మార్పుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు సంప్రదాయ సాగు విధానాలకు బదులుగా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని,నీటిని ప్రతి చుక్కను పొదుపుగా వినియోగిస్తూ తక్కువ వ్యవధిలో అధిక ఆదాయం అందించే కూరగాయల సాగుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ శాస్త్రీయ సలహాలను పాటిస్తే వర్షాభావ పరిస్థితుల్లో కూడా మెరుగైన దిగుబడులు సాధించి ఆర్థికంగా లాభపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విధులలో అలసత్వం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.ఈ సమీక్షలో డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, కృతిక, జడ్పీ సీఈవో శోభారాణి, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి వెంకటరమణ, ఉద్యానవన శాఖ అధికారి , సంబంధిత శాఖల అధికారులు,మండల స్పెషల్ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రీసర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద

**వరంగల్, మహా;**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద శుక్రవారం సంగెం మండలం ముమ్మడివరం గ్రామంలో జరుగుతున్న రీసర్వే గ్రామ సరిహద్దుల నిర్ధారణ పనులను వర్షాన్ని సైతం లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్ జిల్లాలో 70 గ్రామాల్లో జరుగుతున్న నక్షా రిసర్వే లో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గ్రామ సరిహద్దుల గుర్తింపు ప్రక్రియ, సర్వే విధానం, క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సరిహద్దుల నిర్ధారణను ఖచ్చితత్వంతో, పారదర్శకంగా పూర్తి చేయాలని, భూ రికార్డులలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిబంధనలకు అనుగుణంగా రీసర్వే పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు, సంగెం తాసిల్దార్ రాజకుమార్, ముమ్మిడివరం సర్పంచ్ కే.రామస్వామి, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.





# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ త్వరగా చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో బి.ఎల్.ఓ.లు, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ త్వరగా చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మందమర్రి మండలం క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 4వ వార్డులో స్థానిక మండల తహసిల్దార్ సతీష్‌కుమార్, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్ రెడ్డి లతో కలిసి, మందమర్రి మున్సిపాలిటీ లోని 19వ వార్డులో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం ఆగస్టు 3వ వరకు పొడిగించిందని వెల్లడించారు. బి ఎల్ ఓల ద్వారా జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణలో బూత్ స్థాయి ఏజెంట్లు అధికారులకు సహకరించాలని తెలిపారు. నింపిన ఫారాలలోని వివరాలను బూత్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు బి.ఎల్.ఓ. యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని, అర్హత గల ఓటర్లు స్వయంగా ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చేపట్టాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించాలని, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని వివరించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఇంటర్మీడియట్ కు ఆధునికరించడం జరిగిందని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ మండలంలో కలెక్టర్ పర్యటన

- **గోదావారి పుష్కరాలకు తగిన ఏర్పాట్లకు ఆదేశం**
- **ఎన్యుమరేషన్ డిజిటలైజేషన్ తీరు పరిశీలన**



నిర్మల్ మహా: రానున్న గోదావరి నది పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఖానాపూర్ మండలంలో పర్యటించిన ఆయన గోదావరి నది పుష్కర ఘాట్లతో పాటు పట్టణంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ డిజిటలైజేషన్ తీరును పరిశీలించారు.. తప్పనిసరిగా గడువులోగా ఆన్ లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మొత్తం ఓటర్ల సంఖ్య, ఇప్పటి వరకు తిరిగి తీసుకున్న ఫారములు, పూర్తిచేసిన ఆన్ లైన్ వివరాలు అధికారులను అడిగారు. బిఎల్ఓ యాప్ ను పరిశీలించారు. ప్రక్రియను మొత్తం పారదర్శకంగా చేయాలని అన్నారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని చెప్పారు. బూత్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో ఓటర్లకు ఫారములు నింపుటలో సహకారం అందించాలని చెప్పారు. గోదావరి నది పుష్కరాల నిర్వహణకు ఇప్పటినుంచే తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు పుష్కరఘాట్లకు చేరుకునే విధంగా తగిన రోడ్డు సౌకర్యం కల్పించాలని అన్నారు. పుష్కర ఘాట్లను భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా సిద్ధం చేయాలని పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ సోయబ్ హుస్సేన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# పరిసరాలు పరిశుభ్రంగా.. దోమల నివారణే లక్ష్యంగా

- **ఫ్రైడే డ్రైడే లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్**

**అదిలాబాద్ మహా:** మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు మహాలక్ష్మివాడలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్ తో కలిసి ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా అందరూ సహకరించాలని కోరారు.కార్యక్రమంలో భాగంగా కాలనీలో దోమల నివారణ మందు పిచికారీ చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.అనంతరం కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్ విద్యార్థులతో మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ఇంట్లోని చెత్తను తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లో వేసి మున్సిపల్ చెత్త సేకరణ వాహనానికే అందించాలని, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు.అదేవిధంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, ప్రతిరోజూ పాఠశాలకు హాజరై మంచి హాజరు శాతం నమోదు చేసుకోవాలని ప్రోత్సహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి విద్యార్థి తమ పుట్టినరోజు సందర్భంగా ఒక్క మొక్కను నాటి దానిని సంరక్షించాలని, ఈ సందేశాన్ని తమ తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలని సూచించారు

# ఉద్యోగాల పేరుతో మోసం

- **ఒకే కుటుంబం లోని ముగ్గురి వద్ద నుండి 5 లక్షల 30 వేలు వసూలు**
- **ప్రధాన నిందితుడి అరెస్ట్**
- **మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్న డీఎస్పీ**




**అదిలాబాద్ మహా**: జాబ్ ఫ్రాడ్ కేసులో ప్రధాన నిందితుడు మహ్మద్ బాబర్ ను అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ లో మీడియాకు వివరాలు వెల్లడించారు. 2025 అక్టోబర్ 14న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన నుగురు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి, ఒకే కుటుంబానికి చెందిన నుగురు రవి, నర్సమ్మ, పృథ్వీల నుంచి మొత్తం 5లక్షల 30వేలు ఫోన్‌పే ద్వారా వసూలు చేసి, అనంతరం గ్లోబల్ ఫౌండేషన్ పేరుతో నకిలీ నియామక ఉత్తర్వులు అందజేసి మోసం చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. జూలై 16న విశ్వసనీయ సమాచారం మేరకు ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిందితుడు గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్, కరీంనగర్ కు చెందిన మహ్మద్ బాబర్ ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు లేని గ్లోబల్ ఫౌండేషన్ పేరుతో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నట్లు తేలిందన్నారు. ఇతనికి నిర్మల్ కు చెందిన పల్లికొండ కార్తీక్ సూర్యాపేట కు చెందిన రాహులపెంట సతీష్, భైంసా కు చెందిన వడేకర్ నవీన్ కుమార్ మధ్యవర్తులుగా ఉండి అమాయక నిరుద్యోగుల వద్ద డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. వసూలు చేసిన డబ్బులో మధ్యవర్తులకు కమీషన్ ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని తానే తీసుకున్నట్లు బాబర్ ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బాధితులకు ఇచ్చిన నకిలీ నియామక ఉత్తర్వుల ప్రతులు, ఒక ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ కేసులో ఇప్పటికే మధ్యవర్తులైన ముగ్గురిని గతంలోనే అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపామని, తాజాగా ప్రధాన నిందితుడు మహ్మద్ బాబర్ ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తులను నమ్మవద్దని, ఉద్యోగాల పేరుతో ఎవరైనా మోసాలకు పాల్పడితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని డీఎస్పీ ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు ప్రణయ్ కుమార్, విష్ణు ప్రకాష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 20వ తేదీ న డిగ్రీ ప్రత్యేక విడత అడ్మిషన్లు

- 26వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు, 27 వరకు వెబ్ ఆప్షన్ల గడువు
- బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ గ్యారెంటీతో బీఏ ఆనర్స్, AEDP కోర్సులు
- విద్యార్థులు ఇతర జనరల్ డిగ్రీ కోర్సులను కూడా సద్వినియోగం చేసుకోగలరు
- ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత 202627 విద్యా సంవత్సరంలో డిగ్రీ చేసేందుకుగాను చిట్టచివరి ప్రత్యేక విడత అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఉన్నత విద్యా శాఖ చేపట్టిన డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ దోస్త్ లో భాగంగా ఇప్పటికే మూడు విడతల అడ్మిషన్లు పూర్తయ్యాయని గుర్తు చేశారు. ఇప్పుడు చాలామంది విద్యార్థుల నుంచి వస్తున్న అభ్యర్థనలను దృష్టిలో పెట్టుకుని చిట్టచివరిగా ప్రత్యేక విడత అడ్మిషన్ల ప్రక్రియను ఈనెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు చేపట్టనున్నట్లు వివరించారు. 26వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని 27వ తేదీలోగా వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్ లేదా తత్సమాన కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ వాలంటరీ హెల్ప్ లైన్ సెంటర్ సౌకర్యం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 30వ తేదీన సీట్ అలాట్మెంట్ ఉంటుందని తెలిపారు.




**..ఉద్యోగ గ్యారెంటీతో 5 కోర్సులు...**

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ గ్యారెంటీని ఇస్తూ 5 ఏఈడిపి కోర్సులను అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఈ కోర్సులలో చేరిన విద్యార్థులకు మొదటి 2 సంవత్సరాలు కళాశాలలో తరగతులు నిర్వహిస్తామని, చివరి ఏడాది స్టైఫండ్ తో కూడిన ఉద్యోగ సంబంధిత శిక్షణను అందిస్తామని పేర్కొన్నారు. ఈ విషయంలో పూర్తి బాధ్యతను తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఇంత గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు 9959269975 నంబర్ లో సంప్రదించవచ్చని సూచించారు.

**బెల్లంపల్లి డిగ్రీ కళాశాలలో గల కోర్సులు...**

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాదాపు పదికి పైగా వివిధ రకాల డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఏ ఈ డి పి కోర్సులు బీఏ ఆనర్స్,బీకాం బీఎఫ్ఎస్ఐ,బీకాం ఈకామర్స్, బీఎస్సీ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్,బీఎస్సీ హార్టికల్చర్ అండ్ ల్యాండ్ స్కేపింగ్ల తో పాటు ఇతర కోర్సులు బీఏ సిబిసిఎస్, బీకాం టాక్సేషన్,బీకాం సీఏ,బీఎస్సీ ఎంపీసీ,బీఎస్సీ బిజెడ్ సి అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

# భూముల రీ సర్వే ప్రారంభం

- గ్రామ సరిహద్దులు నిర్ణయించి డిజిటలైజేషన్
- రైతులకు భూదార్ కార్డ్
- పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు
- గ్రామసభలో వెల్లడించిన కలెక్టర్



**ఆదిలాబాద్ మహా**: భూ సమస్యల పరిష్కారానికి, వ్యవసాయ రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం బజార్‌హత్నూర్ మండలం గంగాపూర్ గ్రామంలో భూభారతి భూముల సర్వే పై నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం డెడ్రా, మాన్కపూర్ గ్రామాల్లో పర్యటించారు.ముందుగా గంగాపూర్ గ్రామసభలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గతంలో 1934లో జరిగిన సర్వే తర్వాత, మళ్లీ ఇప్పుడు అత్యాధునిక సాంకేతికతతో కూడిన మెషీన్ల ద్వారా భూభారతి రీసర్వే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. జిల్లాలోని మొత్తం 509 గ్రామాలకు గాను, ప్రస్తుతం మొదటి విడతగా 70 గ్రామాలలో ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో నక్ష, రికార్డులు లేని నాన్‌కాడస్ట్రల్ గ్రామాలలో మూడు నాలుగు నెలల క్రితమే ఈ సర్వేను ప్రారంభించామని వెల్లడించారు. ఈ రీసర్వే ద్వారా గ్రామ సరిహద్దులను నిర్ణయించిన అనంతరం, అగ్రికల్చర్, నాన్‌అగ్రికల్చర్ భూములను సర్వే చేసి డిజిటలైజ్ చేస్తామని, దీని ఆధారంగా ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు తరహాలోనే భూములకు 'భూదార్ కార్డ్' అందజేస్తామని స్పష్టం చేశారు. దీనివల్ల భవిష్యత్తులో భూముల రిజిస్ట్రేషన్లు, కొనుగోళ్లు, అమ్మకాలు పారదర్శకంగా జరుగుతాయని, కుటుంబ సభ్యుల మధ్య గానీ, ఇతరుల మధ్య గానీ వచ్చే భూ పంచాయితీలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. మరోవైపు జిల్లాలో, ముఖ్యంగా బజార్‌హత్నూర్ మండలంలో వర్షపాతం చాలా తక్కువగా నమోదవుతోందని, సూపర్ ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి వ్యవసాయ అధికారుల సూచనలను తప్పక పాటించాలని కోరారు. భూమిలో తేమను నిలిపి ఉంచడానికి మల్చింగ్ పద్ధతిని ఉపయోగించాలని, పంటతో పాటు పెరిగే కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని, 2% ఫోలియర్ స్ప్రే చేయాలని రైతులకు సూచించారు. ఒకవేళ వర్షాలు పూర్తిగా లేని పక్షంలో ప్రత్యామ్నాయంగా కందులు, పెసర్లు, మినుములు వంటి ఇతర తక్కువ నీటితో పండే పంటల వైపు వెళ్లాలని, సాగునీటి సదుపాయం లేని రైతులు పంట మార్పిడి చేసుకోవాలని ఉద్ఘాటించారు గ్రామాభివృద్ధిలో భాగంగా వి.బి.జి.రాంజీ స్కీమ్ కింద గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అవసరమైన శాంక్షన్లు ఇచ్చి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. భూ సర్వే సమయంలో రికార్డుల నమోదు కోసం అధికారులు నోటీసులు ఇచ్చినప్పుడు, రైతులు తమ క్లెయిమ్స్, అభ్యంతరాలను సమర్పించి ఈ ప్రక్రియను విజయవంతం చేయడానికి అధికారులకు సహకరించాలని కోరారు.అనంతరం డెడ్రా, మంకపూర్ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి, స్థానిక సమస్యలపై సమీక్షించారు. అటవీ శాఖ అనుమతులు వచ్చినందున ఐటీడీఏ ద్వారా నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే పునఃప్రారంభిస్తామని, 'వీబీజీ రాంజీ' పథకం కింద సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల విడుతలలో మంకపూర్ గ్రామంలోని గుడిసె నివాసితులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. రైతుల సాగునీటి అవసరాల కోసం బోరు, బావి సౌకర్యం ఉన్న వారికి అటవీ శాఖ అనుమతులతో త్రీఫేజ్ విద్యుత్ అందిస్తామన్నారు. రైతులు గ్రూప్‌గా ఏర్పడి రూ. 9,150 చెల్లిస్తే, కిలోమీటర్ పరిధి వరకు 20 స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉచితంగా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించి, గురుకుల ప్రవేశ పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూ సర్వే శాఖ ఏడి ప్రభాకర్, తహసీల్దార్ శ్యామ్ సుందర్, డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్, సర్పంచ్లు సుభాష్, విజయ, అనిల్, ఏవో సౌద్, ఏఈఓ ప్రవీణ్, ఉపాధ్యాయుడు దేవ్ రావ్, స్థానిక రైతులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ నగర్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

**సత్తుపల్లి, జులై 17: మహా**

మండల పరిధిలోని కిష్టారం గ్రామం అంబేద్కర్ నగర్ కాలనీలో వాతావరణ మార్పుల కారణంగా సంక్రమించే వ్యాధుల దృష్ట్యా గ్రామ ఎం.ఎల్.హెచ్.పి నర్సింగ్ వైద్యురాలు ప్రసన్న ఆధ్వర్యంలో శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో జ్వరాలు, రక్తహీనత, షుగర్ వ్యాధులు ఉన్నవారికి రక్త పరీక్షలు నిర్వహించి తగిన మందులను అందించారు. వృద్ధులకు బిపి పరీక్షలు నిర్వహించి నెలవారి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు ప్రసన్న మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తుండడంతో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని దోమల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని, రెండు రోజులకు మించి జ్వరం వస్తే వెంటనే వైద్యశాలను సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎన్.ఎం లు బేగం, సుమతి, ఆశా కార్యకర్తలు సుజాత, చిలకమ్మా తదితరులు పాల్గొన్నారు.




# ఎస్.సి, ఎస్.టి. ల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

**రాష్ట్ర ఎస్.సి, ఎస్.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

మంచిర్యాల, మహా : మంచిర్యాల జిల్లాలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన ప్రజల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్ల శంకర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి ఎస్.సి., ఎస్.టి. లకు సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, ఆశ్రమ పాఠశాలలు, ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టం, ఎస్.సి., ఎస్.టి. గ్రామాలలో మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్ తెగల వారికి రాజ్యాంగం కల్పించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తూ వారి సంక్షేమ, అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో 56 వేల 969 మంది షెడ్యూల్డ్ తెగలు, 1 లక్ష 99 వేల 493 మంది షెడ్యూల్ కులముల వారు ఉన్నారని, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం సంక్షేమ పథకాలు వర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, దుప్పట్లు, బంకర్ బెడ్స్ సమకూర్చడం జరుగుతుందని, వసతి గృహాలు, గురుకులాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనం అందించడం జరుగుతుందని, సి.సి. కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్.సి., ఎస్.టి. సబ్ ప్లాన్ క్రింద నిధుల కేటాయింపు జరుగుతుందని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఎస్.సి., ఎస్.టి. లకు పని కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఎస్.సి., ఎస్.టి. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా 20 లక్షల రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని, అంగన్వాడి, గ్రామపంచాయతీ, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు, పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమని, తద్వారా కేసులు తగ్గుముఖం పట్టడం సంతోషంగా ఉందని తెలిపారు. 1 వేయి కంటే ఎక్కువగా కేసులు నమోదు అయిన జిల్లాలలో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుకు ప్రతిపాదించడం జరిగిందని, మంచిర్యాల జిల్లాలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టం ప్రకారం గ్రామాలలో సభలు నిర్వహించి అర్హులైన గిరిజనులు, గిరిజనేతరులకు నిబంధనలకు లోబడి పట్టాలు జారీ చేసే విధంగా రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో సర్వే చేయాలని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతి లో రోస్టర్ పద్ధతిని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో బెల్ట్ షాపులపై ఆబ్కారీ మద్య నిషేధ శాఖ ఆధ్వర్యంలో కఠిన చర్యలు చేపట్టాలని తెలిపారు. మున్సిపాలిటీలలో ఎస్.సి., ఎస్.టి. పొరుగు సేవల ఉద్యోగులు, సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలని, పి.ఎఫ్. అమలు, భీమా సౌకర్యాన్ని కల్పించాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులములు, తెగల ప్రజలు నివసిస్తున్న గ్రామాలకు రహదారి సౌకర్యం, త్రాగు నీటిని అందించాలని, అట్రాసిటీ కేసులను త్వరగా విచారించి నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని, అట్రాసిటీ బాధితులకు త్వరగా పరిహారం అందించాలని తెలిపారు. జిల్లాలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలను ప్రోత్సహించాలని, ఉపాధి కల్పనలో ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో ఎస్.సి., ఎస్.టి. విద్యార్థుల ప్రవేశాల దృష్ట్యా పాఠశాలలకు చెల్లించవలసిన బకాయిలు, కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు, విదేశీ విద్య ఉపకార వేతనాలు, ఇతర రంగాలకు సంబంధించిన అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ, చిలుక రాజనర్సు, దుర్గ మల్లయ్య, పెద్ది రాజన్న, పౌరసరఫరాల కమిటీ సభ్యులు జిల్లపల్లి వెంకటేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై పర్యవేక్షణ ఏది?

**హాస్పిటల్ ఎదుట సిపిఎం ఆందోళన**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** పాత కొత్తగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యలకు నిలయంగా నిలిచిందని దీనిపై పర్యవేక్షణ కొరవడంతో ఆస్పత్రి ఆవరణమంతా అపరిశుభ్రంగా దర్శనమిస్తుందని సిపిఎం బృందం నాయకులు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం పాత కొత్తగూడెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిపిఎం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సర్వేలో అనేక సమస్యలను బృందం గుర్తించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యల వలయంలా ఉందని అరకొర సదుపాయాలతో చాలీచాలని మందులతో ఉందని అన్నారు. హాస్పిటల్ ప్రాంగణంలో గడ్డి పిచ్చి మొక్కలు బాగా పెరిగి దోమలకు ఆవాసంలా తయారైందని అనారోగ్యంతో వచ్చే రోగులు వారి అనారోగ్యం తగ్గకపోగా కొత్త వ్యాధులు వచ్చేలా ఈ హాస్పిటల్ ఉందని విమర్శించారు. హాస్పిటల్ ప్రహరీ గోడ కూలి గత రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ దానిని నిర్మించకపోవడం కారణంగా ఆ హాస్పిటల్ జంతువులకు ఆవాసంగా తయారైందని అన్నారు. అలాగే వర్కర్ లేక హాస్పిటల్ ఊడ్చే దిక్కు లేదని అన్నారు. కమ్యూనిటీ ఆఫీసర్ లేక డిప్యూటేషన్ పై వచ్చిన డాక్టర్ చూస్తున్నారని అన్నారు. ఇక్కడి డాక్టర్ నీ డిప్యూటేషన్ పై సఫాయి బస్తి వెళ్లారని దీనివలన ఇక్కడ పర్యవేక్షణ లేక పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో వైద్యం కరువైందని అన్నారు. సుమారు పదిహేనువేల జనాభాకు ఒకే హాస్పిటల్ ఉంది. దీనిని అభివృధి చేయడానికి ఎలాంటి నిధులను ప్రభుత్వం కేటాయించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. హాస్పిటల్లో మందులను నిల్వ ఉంచడానికి స్టోర్ రూమ్ లేకపోవడం, అలాగే వర్షం వస్తే హాస్పిటల్లో ఉన్న గదులు అన్ని కురుస్తున్నాయని అన్నారు. దీని ద్వారా రోగులకు ఇచ్చే మందులు తడిసే ప్రమాదం ఉంది. ఇలా రోగుల ప్రాణాలతో ఈ ప్రభుత్వం అధికారులు చెలగాటం ఆడుతున్నారని తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ కమిటీ సభ్యులు ఆలేటి శ్రీనివాస్, మంద నాగకృష్ణ, నాయకులు కొలిపాక వెంకటేశ్వర్లు, ఎస్ కే సాహేభి, ధనియాకుల శివ, కుక్కల ముత్తేష్, బాలకృష్ణ, రాములు, రఘు, సాయి భాస్కర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కోవాలి..
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా

మణుగూరు, మహా : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలు, పార్టీ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. శుక్రవారం మణుగూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సంపన్న వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ సామాన్య ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తోందని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, నల్లధనాన్ని వెలికితీస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేసి జైళ్లకు పంపుతున్నారని ఆరోపించారు. దేశంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచి కొత్త విధానాలను తీసుకురావడం సరికాదని, కార్మికులకు రక్షణగా ఉన్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు నీటిని ఈ ప్రాంతంలోని అన్ని మండలాలకు అందించాలని, గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నప్పటికీ స్థానిక ప్రజలకు న్యాయం జరగడం లేదన్నారు. వర్షాభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా చేపట్టనున్న పాదయాత్రలను విజయవంతం చేయాలని, ప్రజలు, ప్రజాసంఘాలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**-అయోధ్య స్మారక స్తూపానికి భూమిపూజ**

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బొల్లోజు అయోధ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా రామంజారంలో నిర్మించనున్న స్మారక స్తూపానికి శుక్రవారం సాబీర్ పాషా భూమిపూజ చేసి శంకుస్థాపన నిర్వహించారు. అయోధ్య ప్రజా సేవలను చిరస్మరణీయంగా నిలుపుకునేలా స్మారక స్తూపాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీకుమారి, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్‌రావు, సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు సొందే కుటుంబరావు, రామంజరం సర్పంచ్ బాడిశ కల్పన, బాడిశ సతీష్, నోముల రవి, సాంబయ్యగూడెం సర్పంచ్ చీదం ఉషారాణి, ఎస్కే సర్వర్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, ఉపసర్పంచ్ పులిగిల్ల రమేష్, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, కొత్తపల్లి సీతారాములు, ఆధర్ల రాములు, వజ్జా వెంకటేశ్వర్లు, కన్నెబోయిన ప్రసాద్, భీమరాజు కృష్ణ, డొంక రాములు, ఎల్లారావు, మదర్, మామిడిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# సీతారామ ప్రాజెక్ట్ నీళ్లు మండల రైతులకు ఇవ్వాలి

- సిపిఎం డిమాండ్
- రామచంద్రాపురం కాలువ వద్ద నిరసన

**జూలూరుపాడు, మహా:** సీతారామ ప్రాజెక్ట్ నీళ్లను జూలూరుపాడు మండలానికి పిల్ల కాలువల ద్వారా ఇవ్వాలని శుక్రవారం సిపిఎం పార్టీ గుండెపుడి రామచంద్రపురం శాఖల ఆధ్వర్యంలో రామచంద్రాపురంలో సీతారామ ప్రాజెక్ట్ కాలువ వద్ద నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల నాయకులు వి చందర్ రావు, బానొత్ మదు, పద్దం సుగుణ లు మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాకు సంబంధించిన సీతారామ ప్రాజెక్టునిళ్ళను ఈ జిల్లా రైతాంగానికి అందించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వానికి ఉందన్నారు. కానీ ఇక్కడి మంత్రులు జిల్లాకు తీవ్ర అన్యాయం చేసి, ఇతర ప్రాంతాలకు నీటిని తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు వస్తాయన్న ఆశతో కాలువ నిర్మాణానికి ఈ ప్రాంత రైతులు భూములు ఇస్తే, కళ్ళముందే పారుతూ పోతున్నాయని ఆవేదన చెందుతున్నారు. మండల రైతాంగానికి ఇంత అన్యాయం జరుగుతున్న స్థానిక శాసనసభ్యుడు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారాన్ని అందించి, ఈ ప్రాంత రైతులకు కాలువల ద్వారా నీటిని అందించడంతోపాటు ఈ ప్రాంతంలో ఉన్న చెరువులను కాలువ నీటితో నింపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుండెపుడి, రామ చంద్రపురం శాఖ కార్యదర్శులు ఇల్లంగీ సీతారాములు, ఈసం నరసింహారావు, నాయకులు వల్లమల్ల దానయ్య, భూక్యా సురేష్, కోడం బక్కులు, ఇందిరా, నాగేశ్వరరావు, గడిగ రాములు, గడగ లక్ష్మణరావు, రైతులు భానొత్ గిరి, మూక్తి గాంధీ, తాటి బుచ్చి రాములు, రాజు, ప్రవీణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి

**- వ్యవసాయ శాఖ అధికారి బాబురావు**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ప్రణాళిక రూపొందించుకొని వరి సాగుకు బదులుగా పప్పుధాన్యాలు, కూరగాయల పంటలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారి బాబురావు సూచించారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులతో పంటల వైవిధ్యీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నీటి లభ్యత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపిక చేపట్టాలని వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



# వానలు కురవాలని గ్రామదేవతలకు పూజలు

- ఎనకటి ఆచారాలు కొనసాగిస్తున్న గ్రామస్తులు
- తప్పకుండా వర్షం పడుతుందని వారి నమ్మకం

జూలూరుపాడు, మహా:ఎనకటికి పంటల సీజన్ లో వర్షా బావ పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండుతున్న తరుణంలో గ్రామాలలో రైతులు గ్రామదేవతలైన బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లికి కుంబాభిషేకం చేసేవారు. డప్పు దరువులతో గ్రామస్తులంతా కుమ్మరి కావడితో బయలుదేరి ఇంటింటికి తిరిగి గ్రామంలో సేకరించిన కుంభాన్నంత ముత్యాలమ్మ తల్లి కి అభిషేకం చేసేవారు. ఇలా చేయడం వలన ముత్యాలమ్మ తల్లి తననీ తాను శుభ్రపరచుకోవడం కోసం తన మహిమ శక్తితో వర్షం కురిపించడం ద్వారా కరువు కోరల్లోనుండి బయటపడతామని వీరి ప్రగాడ నమ్మకం. ఇలా చేస్తే తప్పకుండా వర్షాలు కురిసేవని గ్రామాలలో నేటికి ఈ సాంప్రదాయం కొనసాగుతోంది. దానిలో భాగంగా ప్రస్తుతం ఏర్పడ్డ తీవ్ర వర్షా బావ పరిస్థితి నుంచి తమను కాపాడాలని శుక్రవారం మండల పరిధి పడమట నర్సాపురంలో గ్రామ దేవతలైన నాభిశిల (బొడ్రాయి) ముత్యాలమ్మ తల్లి కి డప్పు దరువుల నడుమ గ్రామస్తులందరూ కోలాహలంగా జలాభిషేకం, కుంబాభిషేకం చేశారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు విరసిల్లాలని, గ్రామ ప్రజలందరూ సుభిక్షంగా ఉండే విధంగా చూడాలని గ్రామ దేవతలను వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి, పాముల లక్ష్మీనారాయణ, తెల్ల బోయిన లక్ష్మీనారాయణ, గోసు రామారావు, ఉగ్గం నరసింహారావు, సంఘం చిన్న రాజు, తెల్ల బోయిన రమేష్, తెల్లబోయిన మల్లికార్జున రావు, ఉగ్గం రామకృష్ణ తోపాటు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- అభివృద్ధి పై కమిషనర్ తో కలసి ఎమ్మెల్యే నాయిని సమీక్ష

**హన్మకొండ, మహా;** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.శుక్రవారం కుడా కార్యాలయంలో బల్దియాకమిషనర్ వెంకన్న తో కలసి ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య, శానిటేషన్ శాఖల అధికారులతో డివిజన్ల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే సమీక్షించారు. పలు పథకాల కింద కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించిన ఎమ్మెల్యే, ఇంకా టెండర్ ప్రక్రియ పూర్తి కాని పనులను వెంటనే పూర్తి చేయాలని, టెండర్లు పూర్తయిన పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు అందించే విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రధాన ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించిన ఎమ్మెల్యే, హనుమకొండ చౌరస్తా బస్ స్టేషన్ పునరుద్ధరణ పనులకు సంబంధించిన డీపీఆర్‌ను (వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక) త్వరితగతిన సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా హన్మకొండ లో మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి, పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆర్ అండ్ బీ అతిథి గృహం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్‌నాన్‌వెజ్ మార్కెట్ పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. వచ్చే నెల ఖాజీపేట దర్గా ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి సంవత్సరం మాదిరిగానే జీడబ్ల్యూఎంసీ ద్వారా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్ తదితర మౌలిక సదుపాయాల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.
ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సీఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రవికుమార్ తదితర ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- సుజాతనగర్ పోలీస్ స్టేషన్ సందర్శించిన ఎస్పీ



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సైబర్ నేరాలపై ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటుగా సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల నమోదు, ఈసాక్ష్య వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పుష్పగుచ్ఛం అందించి జిల్లా ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది నుంచి జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు.పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాల సంరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల షెడ్‌ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల నమోదు, దర్యాప్తు సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా అప్‌డేట్ చేయాలని, సీసీటీఎన్ఎస్ 2.0, ఈసాక్ష్య అందుబాటులో ఉన్న సాంకేతిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డయల్-100కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి వేగంగా చేరుకుని బాధితులకు అండగా నిలవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీతో పాటు అధికారులు పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, ఎస్సై రమాదేవి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు వైద్యసాయం..

- రూ.9 లక్షల ఎల్ఓసీలు పంపిణీ..
- బాధిత కుటుంబాలకు పరామర్శ..
- ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే పాయం..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, బాపనకుంట, పూజారి నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వైద్య సహాయ పథకాల కింద లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ)లను పంపిణీ చేయడంతో పాటు బాధిత కుటుంబాలను పరామర్శించి, గ్రామ ప్రజా సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు.

**- రూ.9 లక్షల ఎల్ఓసీలు పంపిణీ..**

మణుగూరు మండలం సమితి సింగారం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి చక్రపాణి వైద్య చికిత్స కోసం రూ.4 లక్షల విలువైన ఎల్ఓసీని ఆయన సతీమణి తమ్మిశెట్టి రమణికి ఎమ్మెల్యే అందజేశారు. అలాగే బూర్గంపాడు మండలం పినపాక పట్టినగర్కు చెందిన కొట్టే గిరిజకు వైద్య చికిత్స నిమిత్తం రూ.5 లక్షల విలువైన ఎల్ఓసీని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య సహాయ పథకాల ద్వారా పేదలకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. లబ్ధిదారులు ఎమ్మెల్యేకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

**- మృతుడి కుటుంబానికి పరామర్శ**

ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కాంగ్రెస్ మహిళా నాయకురాలు చల్ల మంగ తండ్రి బత్తుల ఆంజనేయులు కుటుంబాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మణుగూరు మండలం బాపనకుంటలోని వారి నివాసంలో పరామర్శించారు. ఆంజనేయులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో పార్టీ, వ్యక్తిగతంగా తాను కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

**- కంటి శస్త్రచికిత్స చేయించుకున్న నాయకుడికి పరామర్శ**

ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుండ్ల వెంకటేశ్వర్లును(జీ వి) మణుగూరు పూజారి నగర్ అంబేద్కర్ సెంటర్లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని వైద్యుల సూచనలు పాటించాలని, పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజా సేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. అవసరమైతే తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అదేవిధంగా పొట్లపల్లి గ్రామపంచాయతీలో నెలకొన్న తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించాలని గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, మండల ముఖ్య నాయకులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, యూత్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే తమ్మిశెట్టి రమణి, కొట్టే గిరిజ, పొట్లపల్లి సర్పంచ్ మద్దెల సమ్మయ్య, ఉపసర్పంచ్ కోరిపెల్లి రవీందర్, మాజీ సర్పంచ్ తోలేం కళ్యాణి, బడే కృష్ణ, తోలేం కృష్ణ, తాళ్ల గుట్టయ్య, షేక్ మాధర్ సాహెబ్, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గుమాస్తాల సంఘం నాయకులు, మహిళా నాయకులు, అభిమానులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దట్టమైన అటవీ ప్రాంతం.. బుడుగులలో వైద్య శిబిరం..

- మలేరియా కేసు గుర్తింపు.. రక్త నమూనాల సేకరణ..
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచన..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుగ్గ గ్రామపంచాయతీ పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతంలోని వలస ఆదివాసి గిరిజన గ్రామం బుడుగులలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని వైద్య సిబ్బంది సందర్శించి జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. సేకరించిన నమూనాల్లో ఒకరికి మలేరియా నిర్ధారణ కావడంతో వెంటనే చికిత్స ప్రారంభించి అవసరమైన మలేరియా మందులను అందజేశారు. మలేరియా అనుమానితుల నుంచి సేకరించిన ఇతర రక్త నమూనాలను పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ వీరాస్వామి మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మరిగించిన లేదా శుద్ధి చేసిన తాగునీటినే వినియోగించాలని సూచించారు. ప్రతి వారం ఒక రోజు డ్రై డే పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని నివారించవచ్చని అవగాహన కల్పించారు. అదేవిధంగా ఖమ్మంతోగు, బుగ్గ గ్రామాల్లో కూడా వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బుగ్గ సర్పంచ్ మాధవి, సూపర్‌వైజర్ అనసూర్య, ఎంఎటీఎస్ సిబ్బంది అరుణ్‌బాబు, రాంప్రసాద్, కృష్ణ, వైద్య సిబ్బంది సుజాత, కౌసల్య, శ్రావణి, సమ్మక్క, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫలించిన ఎమ్మెల్యే కూనంనేని కృషి

- కొత్తగూడెంకు నైపుణ్యాభివృద్ధి కేంద్రం మంజూరు
- రూ.10కోట్ల రూపాయల నిధులు మంజూరు
- ఏడాదికి వెయ్యి మంది యువతకు శిక్షణ
- మూడు ఎకరాల స్థలంలో భవన నిర్మాణం
- ముఖ్యమంత్రి, ఆర్ అండ్ బి మంత్రికి ధన్యవాదాలు
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



భద్రాద్రి కొత్తగూడెం, మహా: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్(నైపుణ్యాభివృద్ధి కేంద్రం) భవన నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఉత్తర్వులు జారీ చేసిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. శుక్రవారం అయన ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లండించారు. కొత్తగూడెం నియోజకవర్గంలో ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటు కోసం ప్రభుత్వం జీవో నెంబర్ 398 ద్వారా మొదటి విడతగా రూ. 10కోట్ల నిధులను మంజూరు చేస్తూ అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ నియోజకవర్గ యువతకు ఎంతో ప్రయోజనకరంగా మారనున్న ఈ భవనాన్ని మూడు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నట్లు ఆయన వివరించారు. ఈ శిక్షణ కేంద్రం అందుబాటులోకి వస్తే ఏడాదికి వెయ్యి మంది నిరుద్యోగ యువతీ యువకులు వివిధ రకాల వృత్తి నైపుణ్యాలలో శిక్షణ పొందే అద్భుతమైన అవకాశం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి పర్యవేక్షణ ఛార్జీలు లేకుండా ఈ నిర్మాణ పనులను రోడ్లు, భవనాల శాఖ ద్వారానే పూర్తి చేయించడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఇందుకు సంబంధించిన నిధులను నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ కార్పస్ ఫండ్ నుండి భరిస్తారని ఆయన స్పష్టం చేశారు. కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి యువత ఉపాధికి ఎంతో తోడ్పడే ఈ కేంద్రాన్ని మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు, రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.




## రక్షణ ప్రమాణాలతో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించాలి..

- 65 మిలియన్ టన్నుల లక్ష్య సాధనలో మణుగూరు ఏరియా కీలకం..
- డైరెక్టర్ పీ అండ్ పీ కొప్పుల వెంకటేశ్వర్లు..

**మణుగూరు, మహా :** అత్యున్నత రక్షణ ప్రమాణాలను పాటిస్తూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించాలని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. శుక్రవారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన, ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తో కలిసి పీకేఓసీ2, పీకేఓసీ4 ఓపెన్‌కాస్ట్ గనులను సందర్శించి బొగ్గు ఉత్పత్తి, ఓవర్‌బర్డెన్ తొలగింపు పనులు, భారీ యంత్రాల పనితీరు, ఉత్పాదకత, రక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, 202627 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి నిర్దేశించుకున్న 65 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో మణుగూరు ఏరియా కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. ఏరియాకు కేటాయించిన 96.26 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించేందుకు అధికారులు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శ్రామిక శక్తితో పాటు యాంత్రిక శక్తిని సమర్థంగా వినియోగించి ఉత్పాదకతను పెంచాలని ఆదేశించారు. పీకేఓసీ2 గనిలోని వ్యూ పాయింట్ నుంచి బొగ్గు వెలికితీత, ఓవర్‌బర్డెన్ తొలగింపు పనులు, భారీ యంత్రాల పనితీరును పరిశీలించిన ఆయన గని నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే మరింత మెరుగైన పనితీరు కోసం పలు సూచనలు చేశారు. అనంతరం గనిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, సూపర్వైజర్లు, హెవీ ఎర్త్ మూవింగ్ మెషినరీ ఆపరేటర్లతో నేరుగా మాట్లాడి వారి పని పరిస్థితులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి విజయాల వెనుక ప్రతి కార్మికుడి శ్రమ, అంకితభావమే ప్రధాన బలమని పేర్కొంటూ, పనిగంటలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం, షిఫ్టుల మార్పిడి సమయంలో సమయాన్ని వృథా కాకుండా నిర్వహించడం ద్వారా ఉత్పాదకతను మరింత పెంచవచ్చని సూచించారు. దేశ విద్యుత్ రంగానికి సింగరేణి బొగ్గు అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికే ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ సరఫరా చేయాలని, ఉత్పత్తి లక్ష్యాల సాధనలో రక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగి సురక్షిత వాతావరణంలో విధులు నిర్వహించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం డి. వెంకటరామారావు, ఏజీఎం (ఐఈడీ) సీహెచ్ రాంబాబు, ఏరియా ఇంజినీర్ మధన్ నాయక్, ఎంఎన్ ఓసీ ప్రాజెక్ట్ అధికారి ఈ. శ్రీనివాస్, పీకేఓసీ2 ప్రాజెక్ట్ మేనేజర్ సౌరభ్ సుమన్, ఏరియా స్టోర్స్ డీజీఎం రామకృష్ణ, పీకేఓసీ2 మేనేజర్ (ఆపరేషన్స్) సురేశ్ కుమార్, ఏరియా సర్వే అధికారి ఎల్. దయాకర్, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పామాయిల్ ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్

- తప్పిన పెను ప్రమాదం.
- ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు.
- విజయవాడ తరలింపు



**దమ్మపేట ,మహా :** మండల పరిధిలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో గురువారం అర్ధరాత్రి భారీ ప్రమాదం చోటుచేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న ఇద్దరు కార్మికులు, వేడీ నీళ్లు ఒంటిపై పడి తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. ఫ్యాక్టరీలోని ఎంట్రర్ (మల్టిపుల్ ఎఫెక్టివ్ ఎవాపరేటర్) విభాగంలో రాత్రి 11 గంటల సమయంలో వాటర్ లైన్ జామ్ అయింది. సమాచారం అందుకున్న ఆపరేషన్ మెయింటెనెన్స్ సిబ్బంది శివరాం, గణేష్ అక్కడకు చేరుకుని లైన్స్ పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో పైపునకు అమర్చి ఉన్న ఫ్లేంజ్ గ్యాస్ ఒక్కసారిగా పేలిపోయింది.దీంతో అందులోని తీవ్రమైన వేడి నీళ్లు ఇద్దరు కార్మికుల మీద, వీపు, చేతులపై పడటంతో చర్మం కాలిపోయి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఫ్యాక్టరీ మేనేజర్ నాగబాబు తన సిబ్బందితో కలిసి స్పందించారు. క్షతగాత్రులను సత్తుపల్లి లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న కార్మికుల కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఉండటంతో, తమ వారికి మరింత మెరుగైన వైద్యం అందించేందుకు విజయవాడ తరలించాలని యాజమాన్యాన్ని కోరారు. దీంతో స్పందించిన అధికారులు ప్రైవేట్ అంబులెన్స్‌లో క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై పర్యవేక్షణ ఏది?

**హాస్పిటల్ ఎదుట సిపిఎం ఆందోళన**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** పాత కొత్తగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యలకు నిలయంగా నిలిచిందని దీనిపై పర్యవేక్షణ కొరవడంతో ఆస్పత్రి ఆవరణమంతా అపరిశుభ్రంగా దర్శనమిస్తుందని సిపిఎం బృందం నాయకులు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం పాత కొత్తగూడెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిపిఎం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సర్వేలో అనేక సమస్యలను బృందం గుర్తించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యల వలయంలా ఉందని అరకొర సదుపాయాలతో చాలీచాలని మందులతో ఉందని అన్నారు. హాస్పిటల్ ప్రాంగణంలో గడ్డి పిచ్చి మొక్కలు బాగా పెరిగి దోమలకు ఆవాసంలా తయారైందని అనారోగ్యంతో వచ్చే రోగులు వారి అనారోగ్యం తగ్గకపోగా కొత్త వ్యాధులు వచ్చేలా ఈ హాస్పిటల్ ఉందని విమర్శించారు. హాస్పిటల్ ప్రహరీ గోడ కూలి గత రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ దానిని నిర్మించకపోవడం కారణంగా ఆ హాస్పిటల్ జంతువులకు ఆవాసంగా తయారైందని అన్నారు. అలాగే వర్కర్ లేక హాస్పిటల్ ఊడ్చే దిక్కు లేదని అన్నారు. కమ్యూనిటీ ఆఫీసర్ లేక డిప్యూటేషన్ పై వచ్చిన డాక్టర్ చూస్తున్నారని అన్నారు. ఇక్కడి డాక్టర్ నీ డిప్యూటేషన్ పై సఫాయి బస్తి వెళ్లారని దీనివలన ఇక్కడ పర్యవేక్షణ లేక పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో వైద్యం కరువైందని అన్నారు. సుమారు పదిహేనువేల జనాభాకు ఒకే హాస్పిటల్ ఉంది. దీనిని అభివృద్ధి చేయడానికి ఎలాంటి నిధులను ప్రభుత్వం కేటాయించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. హాస్పిటల్లో మందులను నిల్వ ఉంచడానికి స్టోర్ రూమ్ లేకపోవడం, అలాగే వర్షం వస్తే హాస్పిటల్లో ఉన్న గదులు అన్ని కురుస్తున్నాయని అన్నారు. దీని ద్వారా రోగులకు ఇచ్చే మందులు తడిసే ప్రమాదం ఉంది. ఇలా రోగుల ప్రాణాలతో ఈ ప్రభుత్వం అధికారులు చెలగాటం ఆడుతున్నారని తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ కమిటీ సభ్యులు ఆలేటి శ్రీనివాస్, మంద నాగకృష్ణ, నాయకులు కొలిపాక వెంకటేశ్వర్లు, ఎస్ కే సాహెబీ, ధనియాకుల శివ, కుక్కల ముత్తేష్, బాలకృష్ణ, రాములు, రఘు, సాయి భాస్కర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌ఎస్‌టీపి నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే డీ-స్లడ్జింగ్ ఆపరేటర్ల పై కఠిన చర్యలు
- జిడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న

**వరంగల్, కార్పొరేషన్ మహా ;** గ్రేటర్ వరంగల్ నగరంలోని సెప్టిక్ ట్యాంకుల నుంచి సేకరించే ఫీకల్ స్లడ్జ్‌ను తప్పనిసరిగా ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ లకే తరలించాలని, నిబంధనలను ఉల్లంఘించి ఎక్కడైనా అక్రమంగా వ్యర్థాలను పారబోస్తే డీస్లడ్జింగ్ ఆపరేటర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న హెచ్చరించారు.శుక్రవారం కమిషనర్ కార్యాలయంలో 15, 150కేఎల్‌డీ ఎఫ్ఎస్టీపీల నిర్వహణ ఏజెన్సీ ప్రతినిధులు, డీస్లడ్జింగ్ ఆపరేటర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల తో కమీషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలోని అన్ని డీస్లడ్జింగ్ ఆపరేటర్లు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. సెప్టిక్ ట్యాంకుల నుంచి సేకరించిన ఫీకల్ స్లడ్జ్‌ను శాస్త్రీయ శుద్ధి కోసం ఎఫ్ఎస్టీపీకి మాత్రమే తరలించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ ప్రదేశాలు, చెరువులు, కాలువలు లేదా ఇతర ప్రాంతాల్లో అక్రమంగా పారబోయరాదని స్పష్టం చేశారు.నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించిన డీస్లడ్జింగ్ ఆపరేటర్ల పై జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్రతి



ఆపరేటర్ బాధ్యతా యుతంగా వ్యవహరించాలని సూచించారు.ఎఫ్ఎస్టీపీ నిర్వహణ సంస్థ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రోజువారీ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్లాంట్ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.ఈ సమావేశంలో సీఎంహెచ్ఓ డాక్టర్. రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్. రాజేష్, హస్కీ సంస్థ ప్రతినిధి, డా. జనార్ధన్ మోహన్, డీస్లడ్జింగ్ ఆపరేటర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తెలుగు, మలయాళంలో యుక్తి జోరు

మోడలింగ్ ప్రపంచం నుంచి వెండితెరకు అడుగుపెట్టి తక్కువ కాలంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి యుక్తి తరేజా వరుస అవకాశాలతో దూసుకెళ్తోంది. అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ యువ కథానాయిక దక్షిణాది సినీ పరిశ్రమలో వేగంగా తన స్థానాన్ని బలపరుచుకుంటోంది. ఎంటీవీ 'సూపర్ మోడల్ ఆఫ్ ది ఇయర్' కార్యక్రమం ద్వారా గుర్తింపు పొందిన యుక్తి, తన ఆకర్షణీయమైన వ్యక్తిత్వంతో సినీ నిర్మాతల దృష్టిని ఆకర్షించింది. 2023లో నాగశౌర్య సరసన నటించిన 'రంగబలి' చిత్రంతో తెలుగు చిత్రసీమలో కథానాయికగా పరిచయమైంది. ఆ చిత్రంలో ఆమె నటనకు ప్రేక్షకులతో పాటు సినీ వర్గాల నుంచి కూడా మంచి ప్రశంసలు లభించాయి.ఆ తర్వాత మలయాళ చిత్రసీమలోకి అడుగుపెట్టి ఉన్ని ముకుందన్‌తో కలిసి నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'మార్కో' (2024) ద్వారా మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఈ చిత్రం ఆమె కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలవడం విశేషం.ఇటీవల కిరణ్ అబ్బవరం హీరోగా వచ్చిన 'కే ర్యాంప్' (2025) చిత్రంలో 'మెర్సీ జాయ్' పాత్రలో నటించి మరోసారి తన నటనా ప్రతిభను చాటుకుంది. భావోద్వేగ సన్నివేశాలతో పాటు వినోదాత్మక పాత్రలను కూడా సమర్థంగా పోషించగలనని ఈ చిత్రంతో నిరూపించింది.సాంప్రదాయ నీలంబూడిద రంగుల చీరలో, బంగారు ఆభరణాలతో మెరిసిపోతున్న యుక్తి తాజా ఫొటోలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. రాబోయే చిత్రాలపై కూడా మంచి అంచనాలు నెలకొనడంతో, యుక్తి తరేజా దక్షిణాది సినీ పరిశ్రమలో మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.





# బేబీ బంప్‌తో రెబా సందడి

తెలుగు ప్రేక్షకులకు 'సామజవరగమన' చిత్రంతో చేరువైన మలయాళ నటి రెబా మోనికా జాన్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా నిలిచారు. తాజాగా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న బేబీ బంప్ ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ లో వెకేషన్‌ను ఆస్వాదిస్తున్న రెబా, బీచ్ రిసార్ట్‌లో రెడ్ కలర్ ప్రింటెడ్ మ్యాక్సీ డ్రెస్‌లో దిగిన చిత్రాలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.మోడలింగ్‌తో కెరీర్‌ను ప్రారంభించిన రెబా, సంప్రదాయ దుస్తులైనా, ఆధునిక వస్త్రధారణైనా తనదైన స్టైల్‌తో ఆకట్టుకుంటూ వస్తున్నారు. 2022లో తన చిరకాల స్నేహితుడు జోమోన్ జోసెఫ్‌ను వివాహం చేసుకున్న ఆమె, పెళ్లి తర్వాత కూడా సినీ కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. తెలుగులో 'సామజవరగమన'తో పాటు పలు చిత్రాల ద్వారా మంచి గుర్తింపు సంపాదించుకున్నారు.ప్రస్తుతం గర్భవతిగా ఉన్న రెబా ఫుకెట్ బీచ్‌లో ప్రకృతి అందాల మధ్య ఫొటోలకు పోజులిచ్చారు. ఎరుపు రంగు మ్యాక్సీ డ్రెస్‌లో బేబీ బంప్‌ను ఎంతో ఆత్మవిశ్వాసంతో ప్రదర్శించగా, ఆమె ముఖంలో కనిపిస్తున్న ప్రెగ్నెన్సీ గ్లో అభిమానులను ఆకట్టుకుంటోంది. "మీ చిరునవ్వు మరింత అందంగా ఉంది", "ప్రెగ్నెన్సీ గ్లో అద్భుతంగా ఉంది" అంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.ఈ ఫొటోలను పంచుకుంటూ రెబా భావోద్వేగమైన క్యాప్షన్ కూడా రాశారు. "సమయం ఎంత వేగంగా గడిచిపోయిందో తెలియడం లేదు. బేబీ బంప్‌తో గడిపే చివరి కొన్ని రోజులను ఆస్వాదిస్తున్నాను" అంటూ తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు.రెబా పోస్టుకు అభిమానులతో పాటు సినీ ప్రముఖులు కూడా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. త్వరలో మాతృత్వాన్ని ఆస్వాదించబోతున్న ఆమె ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కామెంట్లు చేస్తున్నారు. వెండితెరపై తన అందం, అభినయంతో ఆకట్టుకున్న రెబా.. ఇప్పుడు మాతృత్వ కాంతితో మరింత అందంగా కనిపిస్తూ అభిమానుల మనసులు గెలుచుకుంటున్నారు.



# నిర్మాతగా శరత్ చంద్ర నాయుడు

సినిమా విజయానికి మంచి కథతో పాటు ఆ కథను ప్రేక్షకుల ముందుకు సమర్థంగా తీసుకెళ్లే ప్రచారం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఈ రెండింటి ప్రాధాన్యాన్ని బాగా అర్థం చేసుకున్న వ్యక్తిగా పేరొందిన శరత్ చంద్ర నాయుడు ఇప్పుడు నిర్మాతగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించి టాలీవుడ్‌లో ప్రత్యేక చర్చకు కారణమవుతున్నారు. డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా ప్రమోషన్లలో తనదైన ముద్ర వేసిన ఆయన, ఇప్పుడు కంటెంట్ నిర్మాణ రంగంలోనూ తన ప్రతిభను చాటుకుంటున్నారు.
అల్లు అర్జున్ టీమ్‌లో కీలక సభ్యుడిగా ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న శరత్ చంద్ర నాయుడు ఇండస్ట్రీకి సుపరిచితుడే. అనేక విజయవంతమైన చిత్రాలకు డిజిటల్ ప్రమోషన్ వ్యూహాలను రూపొందించిన ఆయన, ప్రేక్షకుల అభిరుచిని అంచనా వేయడంలో ప్రత్యేక నైపుణ్యం సంపాదించారు. ఇప్పుడు నిర్మాతగా రూపొందించిన తొలి వెబ్ సిరీస్ 'గుర్తుకొస్తున్నాయి' ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతూ ప్రశంసలు అందుకుంటోంది. ఈ ప్రాజెక్టులో శరత్ చంద్ర కేవలం నిర్మాతగా మాత్రమే కాకుండా కథ రూపకల్పన, కంటెంట్ అభివృద్ధి వంటి అంశాల్లోనూ కీలక పాత్ర పోషించారు. ఆయన నిర్వహిస్తున్న 'రేలంగి మావయ్య' సోషల్ మీడియా వేదికలో 90వ దశకపు జ్ఞాపకాలను పంచుకుంటూ వచ్చిన కంటెంట్‌కు లభించిన ఆదరణే ఈ వెబ్ సిరీస్‌కు ప్రేరణగా నిలిచిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రేక్షకుల్లో నాస్టాల్జియాను మళ్లీ గుర్తుచేసే ప్రయత్నంగా ఈ కథను రూపొందించినట్లు తెలుస్తోంది.
ప్రేక్షకుల అభిరుచులు, భావోద్వేగాలను అర్థం చేసుకునే మార్కెటింగ్ అనుభవాన్ని కంటెంట్ రూపకల్పనలో సమర్థంగా వినియోగించుకోవడమే ఈ వెబ్ సిరీస్ విజయానికి ప్రధాన కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏ అంశం ప్రేక్షకులకు చేరువ అవుతుందో, ఏ భావోద్వేగం ప్రభావం చూపుతుందో తెలుసుకునే అనుభవం కథనంలో స్పష్టంగా కనిపిస్తోందని అంటున్నారు.
శరత్ చంద్ర నాయుడు నిర్మాతగా మారిన సందర్భంగా అల్లు అర్జున్ కూడా ప్రత్యేకంగా అభినందించినట్లు సమాచారం. చాలా కాలంగా తనతో కలిసి పనిచేసిన సహచరుడు కొత్త బాధ్యతలు చేపట్టడాన్ని బన్నీ స్వాగతించడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.ఇటీవలి కాలంలో సినీ పరిశ్రమలో తెరవెనుక పనిచేసే ప్రతిభావంతులు నిర్మాతలు, రచయితలు, క్రియేటివ్ మేకర్లుగా ఎదుగుతున్న ధోరణి కనిపిస్తోంది. ఆ జాబితాలో ఇప్పుడు శరత్ చంద్ర నాయుడు కూడా చేరారు. తొలి ప్రయత్నానికే సానుకూల స్పందన రావడంతో, మార్కెటింగ్ రంగంలో చూపిన ప్రతిభను నిర్మాతగానూ కొనసాగిస్తారనే నమ్మకం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# వినూత్న పోస్టర్‌తో 'పళ్ళబురుసు'

తెలుగు చిత్ర పరిశ్రమలో వైవిధ్యమైన కథలకు ఎప్పుడూ ప్రాధాన్యం ఇచ్చే అన్నపూర్ణ స్టూడియోస్ మరో ఆసక్తికరమైన చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'పళ్ళబురుసు' చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోస్టర్‌లో కనిపించిన వినూత్న కాన్సెప్ట్ సినిమాపై ఒక్కసారిగా ఆసక్తిని పెంచుతోంది.విడుదలైన పోస్టర్‌లో జిల్లా కోర్టు ఆవరణను నేపథ్యంగా చూపిస్తూ, న్యాయదేవత త్రాసుకు బదులుగా భారీ టూత్‌బ్రష్‌ను ప్రతీకాత్మకంగా ఉపయోగించారు. ఆ బ్రష్‌పై వెన్ను వెన్నుకు ఆనుకుని కూర్చున్న ఇద్దరు ప్రధాన పాత్రధారుల లుక్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని రేకెత్తిస్తోంది. టైటిల్‌కు తగ్గట్టుగానే పోస్టర్‌ను వినోదాత్మకంగా, ప్రాంతీయతను ప్రతిబింబించేలా రూపొందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతో ఇది హాస్య ప్రధాన సామాజిక లేదా రాజకీయ నేపథ్య కథతో తెరకెక్కుతున్న చిత్రమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఈ చిత్రంలో సీనియర్ నటుడు సుధాకర్ రెడ్డి, 'బలగం' చిత్రంతో గుర్తింపు పొందిన మురళీధర్ గౌడ్ తండ్రీకొడుకులుగా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వీరిద్దరి మధ్య వచ్చే హాస్యభరితమైన,



భావోద్వేగ సన్నివేశాలు సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయని చిత్రబృందం చెబుతోంది. ప్రజ్వల్ యాద్మ, గోమతి రెడ్డి, కిరణ్ మాచా ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి ఉదయ్ చౌహాన్ కథ, స్క్రీన్‌ప్లేతో పాటు దర్శకత్వ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణాని (ఎపిక్ స్టూడియోస్) నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. సంగీత దర్శకుడు పవన్ సీహెచ్, ఛాయాగ్రాహకుడు వినోద్ కె. బంగారి, ఎడిటర్ సృజన అడుసుమిల్లి, ప్రొడక్షన్ డిజైనర్ క్షితిజ్ జీవన్ రణధీర్ ఈ చిత్రానికి సాంకేతిక బృందంగా పనిచేస్తున్నారు.
స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా 2026 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. వినూత్న కథ, ఆసక్తికరమైన పోస్టర్, బలమైన నటీనటులతో రూపొందుతున్న 'పళ్ళబురుసు' టాలీవుడ్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# మలైకా వీడియోపై ట్రోల్స్ వర్షం

xముంబైలో బాలీవుడ్ ఫ్యాషన్ ఐకాన్ మలైకా అరోరా కనిపించిన తాజా వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రముఖ ఇన్‌స్టాగ్రామ్ పేజీ ఒకటి **"మలైకా అరోరా స్పాటెడ్ ఇన్ టౌన్"** అనే క్యాప్షన్‌తో ఈ వీడియోను షేర్ చేయగా, బ్యాక్‌గ్రౌండ్‌లో *'దిల్ నైయో లగ్నా'* పాటను జత చేసింది. జిమ్‌కు వెళ్తున్న సందర్భంగా స్పోర్ట్స్‌వేర్‌లో కనిపించిన మలైకా మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది.వీడియో వైరల్ అయిన తర్వాత కామెంట్ల విభాగంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు నెటిజన్లు ఆమె దుస్తులు, నడక శైలిపై విమర్శలు చేస్తూ ట్రోలింగ్‌కు దిగారు. మరికొందరు వయస్సును ప్రస్తావిస్తూ ప్రతికూల వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో సెలబ్రిటీల వ్యక్తిగత ిషయాలకు మీడియా అధిక ప్రాధాన్యం ఇస్తోందంటూ మీడియాపైనా విమర్శలు వినిపించాయి.మరోవైపు మలైకా అభిమానులు మాత్రం ఆమెకు మద్దతుగా నిలిచారు. ఆమె ఫిట్‌నెస్, గ్లామర్, స్టైల్‌ను ప్రశంసిస్తూ హార్ట్, ఫైర్ ఎమోజీలతో స్పందించారు. ఎప్పటిలాగే ఎంతో స్టైలిష్‌గా కనిపిస్తున్నారంటూ అభిమానులు ప్రశంసలు కురిపించారు.అయితే ఈ పోస్టు కింద సాధారణ కామెంట్ల కంటే బాట్ అకౌంట్లు, ఫేక్ ప్రొఫైల్‌ల నుంచి వచ్చిన స్పామ్ సందేశాలే ఎక్కువగా కనిపించాయి. ఫాలోవర్లను పెంచుతామంటూ వచ్చే ప్రకటనలు సోషల్ మీడియాలో పెరుగుతున్న స్పామ్ సంస్కృతిని మరోసారి వెలుగులోకి తెచ్చాయి. గత కొన్నేళ్లుగా మలైకా అరోరా తన గ్లామరస్ ఫోటోషూట్లు, ఫిట్‌నెస్, ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌లతో నిరంతరం వార్తల్లో నిలుస్తున్నారు. సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ కలిగిన ఆమె బ్రాండ్ ప్రమోషన్లు, ప్రకటనలు, టెలివిజన్, రియాలిటీ షోల ద్వారా కూడా గణనీయమైన ఆదాయాన్ని ఆర్జిస్తూ తన ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com